

ధర్మశ్రీ నన్ను కొట్టారు

విశాఖ డెయిరీలో చర్చల కోసం వెళితే చెయ్యి చేసుకున్నారు

- వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ సన్యాసిరావు ఆవేదన
- ఎమ్మెల్యే తీరుకు నిరసనగా పదవికి రాజీనామా చేస్తున్నట్టు వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో ధర్మశ్రీకి టికెట్ ఇస్తే మద్దతు ఇవ్వబోమని విస్పష్టం

- వార్త 6 పేజీలో

అంతా గుట్టుగా..

రుషికొండపై రూ.450 కోట్లతో నిర్మించిన భవనాలు నేడు ప్రారంభం



రుషికొండపై నిర్మించిన భవనం

- పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా చేతులమీదుగా కార్యక్రమం
- అధికారులు, పార్టీ నాయకులకు మాత్రమే ఆహ్వానం
- మీడియాకు సమాచారం నిల్
- ఆది నుంచి సీఎం క్యాంపు కార్యాలయం కోసం నిర్మించిన భవనాలుగా ప్రచారం

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రుషికొండపై నిర్మించిన సీఎం క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవాన్ని గుట్టుగా నిర్వహిస్తున్నారు. దాదాపు రూ.450 కోట్లు పెట్టి నిర్మించిన ఈ భవనాన్ని సీఎం ప్రారంభించాలి. కానీ ఎందుకనో పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజాకు ఆ బాధ్యత అప్పగించారు. ఆమె బుధవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. పర్యాటక శాఖ తరఫున గురువారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 'అభివృద్ధి చేసిన రుషికొండ రిసార్ట్ ప్రారంభోత్సవం' అంటూ ఆహ్వాన పత్రికలు ముద్రించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజనితో కలిసి ప్రారంభిస్తారని అందులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పర్యాటక బోర్డు చైర్మన్, సభ్యులు, వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులను మాత్రమే ఆహ్వానించారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభోత్సవం అని ముద్రించారు. సాధారణంగా ఇలాంటి కార్యక్రమాలకు మీడియాను ఆహ్వానిస్తారు. రుషికొండ దూరం కాబట్టి పౌర సంబంధాల శాఖ తరఫున వాహనం ఏర్పాటుచేసి మరీ తీసుకువెళతారు. అయితే అలాంటి ఏర్పాట్లు ఏమీ చేయలేదు. మంత్రులు విశాఖపట్నం వచ్చినట్టు గానీ, రుషికొండ రిసార్ట్ ప్రారంభిస్తున్నట్టు గానీ తెలియజేయలేదు. ఇది పర్యాటకుల కోసం నిర్మించినదే అయితే రాష్ట్రం, దేశం మొత్తం తెలిసేలా ప్రకటనలు ఇచ్చి, మీడియా ద్వారా ప్రచారం చేయాలి. కానీ రిసార్ట్ ప్రారంభిస్తున్నట్టు ఎవరికీ తెలియకుండా ఉంచుతున్నారంటే అందులో అంతరార్థం ఏమిటో మంత్రి రోజానే వెల్లడించాలి. ఈ నిర్మాణాలు జరిగినప్పుడు కూడా ఎవరినీ అనుమతించలేదు. హైకోర్టు అనుమతులు తీసుకుని పనులు ప్రారంభించినప్పుడు సీపీఐ సీనియర్ నేత నారాయణ ఒకసారి సందర్శించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ని, స్థానిక నాయకుల్ని ఎవరినీ అనుమతించలేదు. ఇప్పుడు అక్కడ పర్యాటకులకు ఎలాంటి వసతులు కల్పించారో తెలియనివ్వడం లేదు. అది సీఎం క్యాంపు కార్యాలయం అని ప్రచారం జరుగుతున్నా, దానిపై కోర్టులో కేసులు ఉన్నా వాటి గురించి ప్రస్తావించకుండా 'రుషికొండ రిసార్ట్' ప్రారంభోత్సవం అని రిబ్బన్ కత్తిరించబోతున్నారు.

ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభం

పర్యాటక శాఖ విశాఖపట్నం నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఆధ్యాత్మిక యాత్రలను గురువారం ప్రారంభిస్తోంది. ఇది కూడా ఆ శాఖా మంత్రి రోజా చేతులు మీదుగానే బీచ్ రోడ్డులో గోకుల్ పార్కు ఎదురుగా నిర్వహిస్తున్నారు. దీనిపై కూడా పర్యాటక శాఖాధికారులు మీడియాకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

పెందుర్తిలో పట్టపగలు చోరీ

కారులో దర్జాగా వచ్చి ఫ్లాట్‌లోకి ప్రవేశం

- 2 లక్షలు నగదు, రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు అపహరణ



చోరీకి పాల్పడిన అగంతుకుడు

పెందుర్తి, ఫిబ్రవరి 28: పెందుర్తి ప్రశాంతినగర్ సమీపాన గల సూర్యానగర్‌లో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. కారులో దర్జాగా వచ్చిన ఓ ఆగంతకుడు మాస్క్ ధరించి అపార్టుమెంట్‌లోకి ప్రవేశించాడు. అటుఇటు చూసి ఒక ఫ్లాట్‌లో చొరబడి రూ.2 లక్షలు, 2 తులాల బంగారు, 15 తులాల వెండి వస్తువులు అపహరించుకుపోయాడు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రశాంతినగర్‌లోని ఎంకే రాయల్ అపార్టుమెంట్‌లో అరవింద్ కుటుంబంతో సహా ఆరు నెలల నుంచి నివాసం ఉంటున్నారు. ఆయన పెందుర్తిలో పెయింట్ వ్యాపారం చేస్తుంటారు. అరవింద్‌కు క్యారేజీ ఇచ్చేందుకు ఆయన భార్య ఫ్లాట్‌కు తాళం వేసి వెళ్లారు. ఆ సమయం (ఉదయం 11 గంటలు)లో మాస్క్ ధరించి కారులో వచ్చిన ఓ వ్యక్తి అపార్టుమెంట్ సమీపంలో దానిని పార్కింగ్ చేశాడు. అక్కడ నుంచి నడుచుకుంటూ గ్రౌండ్ ఫ్లోర్‌లో గల అరవింద్ ఫ్లాట్ వద్దకు చేరుకున్నాడు. కొంతసేపు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నట్టు పరిసర ప్రాంతాలు పరిశీలించాడు. కారిడార్‌లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత అరవింద్ ఫ్లాట్ తాళం చాకచక్యంగా తీసి లోనికి ప్రవేశించాడు. నిమిషాల్లో ఇంట్లో కాజేసిన సొత్తుతో ఆగంతకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారాన్ని తెలుసుకున్న అరవింద్ ఇంటికి వచ్చి చూడగా...బీరువాలో భద్రపరిచిన నగదు, బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కాగా, సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించిన నేర విభాగ పోలీసులు చోరీకి పాల్పడిన వ్యక్తి పాత నేరస్థుడిగా గుర్తించారు. సీసీ కెమెరాలో ఆగంతకుడు అపార్టుమెంట్‌లోకి ప్రవేశం, కారిడార్‌లో మాట్లాడడం తదితర దృశ్యాలన్నీ రికార్డయ్యాయి. కేసు నమోదు చేశామని, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని క్రైమ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల పెందుర్తి పరిసరాల్లో వరుస చోరీలు జరుగుతుండడంతో జనాలు ఆందోళన చెందుతున్నారు. వారం కిందట ప్రశాంతినగర్, సూర్యానగర్, బాలాజీ నగర్‌లో వరుస చోరీలు జరిగాయి.

నకిలీ విద్యాశాఖాధికారి

జిల్లా విద్యా వలంటీర్‌నంటూ ఆనందపురం మండలంలో పద్దెనిమిదేళ్ల యువకుడి హల్‌చల్



గండిగుండం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల క్లాస్ నోట్స్ తనిఖీ చేస్తున్న నకిలీ యువకుడు

- రెండుసార్లు హెచ్‌ఎంలతో సమావేశం
- పాఠశాలల తనిఖీ
- ఉపాధ్యాయులెవరూ సెలవులు పెట్టకూడదంటూ ఆదేశాలు
- అనుమానం వచ్చి జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన టీచర్లు
- విచారణకు ఆదేశం



గండిగుండం ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో సెల్ఫీ దిగిన నకిలీ అధికారి

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) జిల్లా విద్యా వలంటీర్‌నంటూ ఒక యువకుడు రెండు రోజులపాటు ఆనందపురం మండలంలో ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించడంతోపాటు పాఠశాలలు తనిఖీ చేశాడు. అతడి మాటలు నమ్మి మండల విద్యా శాఖాధికారిని మండల ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపులో యాడ్ చేశారు. ఆలస్యంగా విషయం తెలిసి...మళ్లీ తొలగించారు. వివరాలిలా ఉన్నాయి. మూడు రోజుల క్రితం చరణ్ అనే యువకుడు ఆనందపురం మండల విద్యాశాఖాధికారిణి పద్మావతిని కలిసి తనను ప్రభుత్వం జిల్లా విద్యా వలంటీర్‌గా నియమించిందని చెప్పుకున్నాడు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల తనిఖీ, టీచర్లతో సమావేశాలు నిర్వహిస్తానని చెప్పడంతో అతడి ఫోన్ నంబర్‌ను ఎంఈవో అధికారికంగా నిర్వహించే వాట్సాప్ గ్రూపులో చేర్చారు. ఈ గ్రూపులో మండలంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు ఉంటారు. అనంతరం రెండు రోజులపాటు ఎంఈవో, హెచ్‌ఎంలతో గూగుల్ మీట్ నిర్వహించిన సదరు యువకుడు... హెచ్‌ఎంలను బెదిరించడం కలకలం రేపింది. ఉపాధ్యాయులు ఎవరూ సెలవులు తీసుకోరాదని ఆదేశించాడు. తాను జిల్లా విద్యా వలంటీర్‌నని, ఇద్దరు హెచ్‌ఎంలను మండల విద్యా వలంటీర్లుగా నియమిస్తానని చెప్పాడు. దిబ్బడపాలెం తరువాత గండిగుండం పాఠశాలలను తనిఖీ చేశాడు. గండిగుండం ఎలిమెంటరీ స్కూలును తనిఖీ చేసి సెల్ఫీ దిగాడు. అనంతరం ఉన్నత పాఠశాలలో తరగతులను సందర్శించి విద్యార్థుల నోట్స్ పరిశీలించి పాఠశాల విజిటర్స్ బుక్‌లో సంతకం చేశాడు. తరువాత మండల స్థాయి హెచ్‌ఎంలతో నిర్వహించిన గూగుల్ మీట్‌లో మాట్లాడుతూ గండిగుండం హెచ్‌ఎంను మండల విద్యా వలంటీర్‌గా నియమిస్తున్నట్టు ప్రకటించాడు. ఇదిలావుండగా చరణ్ ప్రవర్తనపై అనుమానం వచ్చిన కొందరు హెచ్‌ఎంలు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఆనందపురం మండల విద్యాశాఖాధికారిణి అప్రమత్తమయ్యారు. వెంటనే ... మిగతా 6వ పేజీలో

ఉక్కులో 36 గంటలు ఆందోళన



హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌లో ఉక్కు సీఎండీ అతుల్‌భట్‌తో చర్చిస్తున్న కార్మిక సంఘ నాయకులు

- బయోమెట్రిక్‌పై వివాదం
- వేతన సవరణతో పాటు సమస్యలు పరిష్కరించిన తరువాతే అమలు చేయాలంటున్న కార్మికులు
- పరిపాలనా భవనంలో 25 గంటల పాటు డైరెక్టర్ (పర్సనల్) దిగ్బంధం
- బయట రహదారిపై కార్మికుల బైఠాయింపు
- స్తంభించిన కార్యకలాపాలు
- కార్మికులను చెదరగొట్టిన పోలీసులు

... మెయిన్ 3వ పేజీలో



ఆదారిమెట్టలో మాట్లాడుతున్న భువనేశ్వరి

గిరిజనుల అభివృద్ధికి చంద్రబాబు కృషి

- ఆదివాసీలకు ఎన్నో పథకాలు అమలు చేశారు
- అరకు కాఫీని దేశ, విదేశాల్లో ప్రమోట్ చేసింది ఆయనే
- పాడేరు మండలం ఆదారిమెట్ట సభలో నారా భువనేశ్వరి

పాడేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారని ఆయన సతీమణి భువనేశ్వరి తెలిపారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరు మండలం చింతలవీధి పంచాయతీ ఆదారిమెట్టలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గిరిజనులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్న దూరదృష్టితో చంద్రబాబు అనేక పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేశారన్నారు. విదేశాల్లో చదువుకునేందుకు ఎన్‌టీఆర్ విదేశీ విద్యోన్నతి, గిరిజన గర్భిణులు, బాలింతలకు గిరి గోరుముద్ద, చిన్నారులకు బాలామృతం, పుట్టిన బిడ్డలకు బేబీ కిట్ పథకాలను అమలు చేశారన్నారు. ఆస్పత్రిలో పురుడు పోసుకున్న తరువాత తల్లీబిడ్డలను ఇంటికి సురక్షితంగా పంపేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్సులను, మారుమూల ... మిగతా 6వ పేజీలో

గ్రేటర్‌లో కలకలం

జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట వార్డు సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- దళితుడినైన తన పట్ల కమిషనర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- ఎడమచేతి మణికట్టు వద్ద బ్లేడ్‌తో కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావం
- అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలింపు



జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన శివఆదిమూర్తి

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం రాత్రి వార్డు సచివాలయ ఉద్యోగి ఒకరు చేతిమణికట్టును బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ తన పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ పది నెలలుగా సస్పెన్షన్‌లో ఉంచి ఉద్యోగం నుంచి తొలగించాలని యత్నిస్తున్నందునే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్టు సదరు ఉద్యోగి కావటి శివ ఆదిమూర్తి ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 45వ వార్డు పరిధిలోని 253 సచివాలయంలో శివ ఆదిమూర్తి వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీగా పనిచేసేవారు. వార్డు శానిటేషన్ సెక్రటరీగా ఉద్యోగంలో చేరిన తమతో మురుగునీటి కాలువల్లో పూడికలు తీయిస్తున్నారంటూ ఆందోళన చేయడంతో మూడేళ్ల కిందట ఆయన్ను సస్పెండ్ చేశారు. తర్వాత సస్పెన్షన్ ఎత్తేయడంతో తిరిగి ఉద్యోగంలోకి చేరారు. యూజర్ చార్జీలు వసూలు కోసం శానిటేషన్ సెక్రటరీలపై ఒత్తిడి పెంచుతున్నారని, దీన్ని తాము తట్టుకోలేకపోతున్నామంటూ శానిటేషన్ సెక్రటరీలంతా పది నెలల కిందట జీవీఎంసీ కమిషనర్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ఆ సమయంలో శివ ఆదిమూర్తిని కమిషనర్ సీఎంసాయికాంత్‌వర్మ సస్పెండ్ చేశారు. తర్వాత సస్పెన్షన్ ఎత్తివేయాలని కమిషనర్‌తోపాటు సీడీఎంఏ, వార్డు సచివాలయం శాఖ డైరెక్టర్‌ను కలిసినప్పటికీ ఫలితం లేకపోగా, ఆయన్ను ఉద్యోగం నుంచి ... మిగతా 6వ పేజీలో

యథావిధిగా పాసింజర్ రైళ్లు

డీఎంయూ సర్వీసులు కూడా...



- ఎట్టకేలకు చార్జీలు తగ్గింపు
- కొవిడ్ తరువాత 'స్పెషల్ ఎక్స్‌ప్రెస్'ల పేరుతో నిర్వహణ... 30 నుంచి 40 శాతం ఎక్కువ చార్జీలు వసూలు
- ఎన్నికలు సమీపిస్తుండడంతో అదనపు బాదుడుకు ఫుల్‌స్టాప్
- కేంద్రం నిర్ణయంతో ప్రయాణికులకు ఊరట

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల సమయం కావడంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'స్పెషల్ ఎక్స్‌ప్రెస్' రైళ్ల పేరుతో 2021 నుంచి సామాన్య ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న అదనపు చార్జీలకు ఫుల్‌స్టాప్ పెట్టింది. ఈ నిర్ణయాన్ని రెండు రోజుల క్రితం నుంచే అమలు చేస్తున్నారు. కరోనా సమయంలో రైళ్లన్నీ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఆ తరువాత రైళ్లను పునరుద్ధరించినా పాసింజర్, డీఎంయూ రైళ్లను మళ్లీ పట్టాలపైకి తీసుకురాలేదు. వాటికే పేర్లు మార్చి 'స్పెషల్ ఎక్స్‌ప్రెస్' అని పేరు పెట్టి 30 నుంచి 40 శాతం అదనపు చార్జీలు వసూలుచేస్తూ వచ్చారు. దీనిపై ప్రయాణికులు, యూజర్స్ కమిటీ ప్రతినిధులు ఎన్నిసార్లు రైల్వే బోర్డుకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. అయితే ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో బీజేపీ నాయకులు బాగా ఆలోచించి పాసింజర్, డీఎంయూ రైళ్లను యథా ప్రకారం పాత పాసింజర్లుగానే నడపాలని నిర్ణయించారు. ఎక్స్‌ప్రెస్ చార్జీలు కాకుండా సాధారణ చార్జీలు వసూలు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు వాల్తేరు డివిజన్ అధికారులు గత రెండు రోజుల నుంచి పాసింజర్ చార్జీలనే వసూలు చేస్తున్నారు.

విశాఖపట్నం నుంచి పలాస, విజయనగరం, భవానీపట్నం (ఒడిశా), రాజమండ్రి, కాకినాడ, కొరాపుట్, కిరండోల్ ప్రాంతాలకు పాసింజర్, డీఎంయూ సర్వీసులు నడుస్తున్నాయి. విశాఖపట్నం నుంచి విజయనగరం వెళ్లాలంటే...బస్సు చార్జీ 70 రూపాయలు. అదే నాన్‌స్టాప్ అయితే 90 రూపాయలు. పాసింజర్ రైలు గానీ, డీఎంయు గానీ ఎక్కితే అందులో మూడో వంతు చార్జీకే గమ్యం చేరుకోవచ్చు. అదే విధంగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళానికి నాన్‌స్టాపు బస్సు చార్జీ రూ.200. అదే రైలులో వెళితే...కేవలం రూ.60 మాత్రమే టిక్కెట్. కేంద్రం నిర్ణయంతో రైలు ప్రయాణికులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇటు తుని నుంచి, అటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వేలాది మంది ఉద్యోగ, వ్యాపార అవసరాల కోసం రోజూ రాకపోకలు చేస్తున్నారు. వారందరికీ దూరాన్ని బట్టి రోజుకు 20 రూపాయల నుంచి 60 రూపాయల వరకు భారం తగ్గుతుంది. దాంతో అంతా హర్షం వ్యక్తంచేస్తున్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 82,776 విద్యార్థులు
- 93 కేంద్రాలు ఏర్పాటు

విశాఖపట్నం/మద్దిలపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు మార్చి ఒకటో తేదీ నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని 93 పరీక్షా కేంద్రాల్లో 82,776 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 40,874 మంది (బాలురు 21,693, బాలికలు 19,181), ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు 41,892 (బాలురు 21,800, బాలికలు 20,092 మంది) మంది ఉన్నారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారిని, ఇంకా జిల్లావ్యాప్తంగా తనిఖీలకు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ప్రశ్నపత్రాల నిల్వకు 16 పాయింట్లు ఏర్పాటుచేశారు. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షలకు సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రులకు ఏమైనా ఇబ్బందులుంటే 0891-2552854, 0891-2567561కు ఫోన్ చేయాలని కోరుతున్నారు.

పరీక్షలకు పక్కా ఏర్పాట్లు



మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లుచేశాం. ప్రధాన పరీక్షలు మార్చి 15వ తేదీ వరకు, ఒకేషనల్, ఇతర పరీక్షలు 20వ వరకు జరుగుతాయి. పరీక్షల నిర్వహణకు 1,800 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని ఆదేశించాం. అన్ని కేంద్రాల్లో పరీక్షల నిర్వహణను విజయవాడ నుంచి ఇంటర్ విద్యా కమిషనర్ లైవ్ స్ట్రీమింగ్‌లో పర్యవేక్షిస్తారు.

పి.మురళీధర్, ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి

భీమిలి బీచ్‌లో పనులు ఆపాలని హైకోర్టు ఆదేశం

- యంత్రాలు సీజ్ చేయాలని ఉత్తర్వులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌లో కోస్తా నియంత్రణ మండలి నిబంధనలను ఉల్లంఘించి జరుగుతున్న పనులను తక్షణమే నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించింది. అక్కడ పనుల కోసం వచ్చిన వాహనాలు, యంత్రాలను సీజ్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. భీమిలి బీచ్‌లో కొద్దికాలంగా తవ్వకాలు, నిర్మాణాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. వీటిపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించగా, ఆ భూమి జిరాయితీ అని, ప్రభుత్వ అటవీ భూమి కాదని అధికారులు చేతులు ఎత్తేశారు. అయితే తీరానికి అతి సమీపాన కోస్తా నియంత్రణ మండలి అనుమతి లేకుండా పనులు ఎలా చేస్తారని ... మిగతా 6వ పేజీలో



భీమిలి తీరాన చకచకా జరుగుతున్న నిర్మాణ పనులు

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

» టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ



సూపర్ సిక్స్ కరపత్రాలందిస్తున్న గండి బాబ్జీ

అల్లిపురం, ఫిబ్రవరి 28: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి లేకున్నా, ప్రజలపై భారం వేస్తూ అప్పుల్లో ముంచారని టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ విమర్శించారు. బుధవారం జీవీఎంసీ 33వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి పార్టీ త్వరలో అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీని గద్దె దించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బంది ఎదుర్కొంటున్నాయన్నారు. అవినీతి, అరాచకాలతో పాలన సాగుతున్నారు. ఈ స్థితిలో రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేనలు గెలుపొంది ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు తథ్యమన్నారు. ఈ మేరకు ప్రజలు గుణపాఠం చెప్పనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జీఓ 16 అమలు చేయాలి'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 28: ప్రైవేట్ ఎయిడెడ్ సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మేలు చేకూర్చేలా జీవో 16 ప్రభుత్వం విడుదల చేయడం ఆనందకరమని ఎయిడెడ్ స్కూల్స్ కరస్పాండెంట్స్, ఉపాధ్యాయులు అన్నారు. అయితే, ఈ జీవోను వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ప్రైవేట్ ఎయిడెడ్ సంస్థల్లో పనిచేస్తూ ప్రభుత్వ గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు ఈ జీవో గొప్ప అవకాశం కల్పించినట్లయిందన్నారు. మంగళవారం జీవో విడుదల చేసినట్లు చెప్పారు. అన్ని రకాలసదుపాయాలు, ద్విభాషా పాఠ్య పుస్తకాల బోధనతో ప్రభుత్వ పాఠశాలలకు దీటుగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలలను ఇంత వరకు ఎవరూ పట్టించుకోలేదన్నారు. 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు ఈ జీవో వరంలాంటిదన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్‌కు ఈసందర్భంగా వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గీతం విద్యార్థినికి రెండు టైటిల్స్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 28: యూనివర్సిటీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో గీతం వర్సిటీ షట్లర్ త్రిషాలి రెండు విన్నర్ టైటిల్స్‌ను సాధించింది. సింగిల్స్‌లో చాంపియన్ ట్రోఫీతోపాటు నగదు బహుమతిని కైవసం చేసుకున్న త్రిషాలి...డబుల్స్‌లో ప్రవల్లికతో కలిసి టైటిల్ విజేతగా నిలిచింది. మంగుళూరులోని విట్ వర్సిటీలో జరిగిన ఈ టోర్నీ మహిళల డబుల్స్ ఈవెంట్‌లో గీతం యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహించిన త్రిషాలి, ప్రవల్లిక అద్భుతంగా రాణించి ఫైనల్స్‌లో ఆతిథ్య విట్ వర్సిటీ షట్లర్లు కావ్య-మాధురి జంటపై 21-9, 9-21, 21-15 స్కోరుతో విజయం సాధించి విన్నర్ టైటిల్ ట్రోఫీతోపాటు నగదు బహుమతిని సొంతం చేసుకున్నారు. మహిళల సింగిల్స్‌లో త్రిషాలి, పురుషుల సింగిల్స్‌లో గీతం వర్సిటీ షట్లర్ ఆతిథ్య రన్నరప్‌గా నిలిచాడు.



బ్యాడ్మింటన్‌లో టైటిల్స్ సాధించిన త్రిషాలి

పార్వతీశ్వరాలయంలో కళ్యాణ మహోత్సవాలు

సీతంపేట, ఫిబ్రవరి 28: సీతంపేట గణేశ్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయం 34వ వార్షిక కల్యాణమహోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భాస్కర శర్మ, శివాజీ శర్మ వేద మంత్రలతో కల్యాణోత్సవ ఘట్టాన్ని ప్రారంభించారు. శివ పార్వతుల ఉత్సవ మూర్తులకు మంగళస్నానం, పూజ లు చేశారు. గురువారం ఉదయం 9.30 గం టలు గణపతి పూజతో ప్రారంభించి స్వామి వారి కళ్యాణం, సాయంత్రం హోమలు నిర్వహించనున్నారు. భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానం

జడ్పీలో నూతన కంప్యూటర్లు అందజేత

మహారాణిపేట, ఫిబ్రవరి 28: జిల్లా పరిషత్ కార్యాలయంలో పలు విభాగాలకు నూతన కంప్యూటర్లను జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర బుధవారం అందజేశారు. గతంలో మరమ్మతుకు గురైన వాటి స్థానంలో వీటిని ఏర్పాటు చేశారు.



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు



బాలలతో అతిథులు, గ్రంథాలయ సిబ్బంది

దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన సీవీ రామన్

» జాతీయ సైన్స్ దినోత్సవంలో వక్తలు

డాబాగార్డెన్, ఫిబ్రవరి 28: ఎన్నో పరిశోధనలతో సీవీ రామన్ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటారని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి అన్నారు. కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. కళాశాలలో సైన్స్ విభాగాల నుంచి విద్యార్థినులు పలు అంశాలపై ప్రాజెక్టులను తయారు చేశారు. ఆర్ట్స్ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు వీటిని తిలకించారు. ఈసందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, రామన్ పరిశోధనలకు నోబెల్ బహుమతి వచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో కో ఆర్డినేటర్ బి.కల్యాణరాము, సంతోషి అనూష, లావణ్య, శరణ్య, వరలక్ష్మి, హైమావతి,నాగలక్ష్మి, లక్ష్మణ్‌నాయుడు, సత్యనాగవేణి, సునీల్, విద్యార్థినులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

మురళీనగర్; గ్రేటరు 50వ వార్డు మురళీనగర్ ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో బుధవారం శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల బాలల భాగస్వామ్యంతో చేపట్టిన వేడుకల్లో ముందుగా సి.వి.రామన్ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమకారులు దత్తి.అప్పలనాయుడు, స్థానిక సచివాలయ సిబ్బంది, సమీప కాలనీ వాసులు కార్యక్రమంలో హాజరై బాలలకు సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. భారతీయ శాస్త్రవేత్తల్లో ప్రత్యేక స్థానమున్న సి.వి. రామన్ బాల్యం, చదువు, ప్రతిభను వివరించారు. ఈ సందర్భంగా బాలలకు డ్రాయింగ్ పోటీలు చేపట్టి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. వేడుకల్లో లైబ్రేరియన్ వై.పద్మజ, రిటైర్డు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉన్నత విలువలతో మెలగాలి

అక్కయ్యపాలెం: విద్యతోపాటు ఉన్నత విలువలతో మెలగాలని ఎంఈవోలు బాలామణి, రామారావు అన్నారు. అబిద్‌నగర్‌లోని ఎస్ఆర్ డిజిటల్ స్కూల్‌లో బుధవారం సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ సరికొత్త ఆలోచనలను ప్రతి ఒక్క విద్యార్థి అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మజ, సీఆర్పీ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

57 సైన్స్ నమూనాలతో ఎగ్జిబిషన్

సీతమ్మధార: గ్రేటర్ విశాఖ 23వ వార్డు మద్దిలపాలెం, చైతన్యనగర్‌లోని గాయత్రి విద్యానిలయంలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 57 సైన్స్ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆయోధ్య రామ మందిరం, వాటర్ ఫౌంటేన్, చంద్రయాన్-3, రైన్ అలారాం తదితర నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ డి.రాజశేఖర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.



నమూనాలతో విద్యార్థులు



ఎస్ఆర్ డిజిటల్ పాఠశాలలో ప్రయోగాలను తిలకిస్తున్న ఎంఈవోలు

గుల్జార్ విశేష సాహిత్య సేవ



గుల్జార్‌కు జ్ఞానపీఠ్ వచ్చిన నేపథ్యంలో కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

సీతంపేట, ఫిబ్రవరి 28: ప్రముఖ ఉర్దూ కవి, సినీగీత రచయిత, హిందీ సినిమా దర్శకుడు గుల్జార్ సాహిత్య రంగంలో విశేష కృషి చేశారని వక్తలు కొనియాడారు. గుల్జార్‌కు కేంద్ర ప్రభుత్వం జ్ఞానపీఠ్ అవార్డు ప్రకటించిన నేపథ్యంలో ఆయన గౌరవార్థం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సభను ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. సొసైటీ కార్యదర్శి నవర ప్రకాశరావు మాట్లాడుతూ ఆయన హిందీ సినిమ పరిశ్రమంలో ప్రముఖ స్థానమని, ఆయన రాసిన పాటలు, మాటలు దర్శకత్వం వహించిన సినిమాలు ఆణిముత్యాలన్నారు. 90 ఏళ్ల వయసులో ఆయనకు కేంద్ర ప్రభుత్వం జ్ఞానపీఠ్ అవార్డు ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు. అనంతరం చిత్ర సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నారావు, హుస్సేన్, చట్లా బాబూరావు రెడ్డి, డాక్టర్ గునేశ్వర బాబ్జీ, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ అగ్రపీఠాధిపతిగా డాక్టర్ జయరావు



మల్లవరపు ప్రకాష్‌నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న జయరావు

మహారాణిపేట, ఫిబ్రవరి 28: రోమన్ క్యాథలిక్ మిషన్ విశాఖ అగ్రపీఠానికి బిషప్‌గా డాక్టర్ పొలిమేర జయరావు నియమితులయ్యారు, బుధవారం మహారాణిపేటలోని బిషప్ కార్యాలయంలో రోమన్ క్యాథలిక్ మిషన్ విశాఖ అగ్ర పీఠాదిపతి మల్లవరపు ప్రకాష్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. సుమారు 12ఏళ్లుగా విశాఖ అగ్రపీఠాధిపతిగా సేవలందించిన ప్రకాష్ పదవీ విరమణ చేయటంతో రోమ్ నగరం పోప్ ప్రావిన్స్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జయరావుకు ఇన్‌చార్జి అగ్రపీఠాధిపతిగా పదవీ బాధ్యతలు అప్పగించారు. అనంతరం. బిషప్ జయరావు మాట్లాడుతూ 1992లో వరంగల్‌లో గురువుగా పదవీ బాధ్యతలు స్వీకరించినట్టు చెప్పారు. అనంతరం 2013లో ఏలూరు బిషప్‌గా బాధ్యతలు స్వీకరించానని, ప్రస్తుతం విశాఖ బిషప్‌గా అదనపు పదవీ బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో పాదర్ జోన్నాడ జాన్ ప్రకాష్, పాదర్ బాలశౌరీ, పాదర్ జయరాజ్, ఎస్. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రంటీస్ మేళాకు విశేష స్పందన


కంచరపాలెం,ఫిబ్రవరి 28 : స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, డిప్లొమా చదివిన వారి కోసం నిర్వహించిన సెంట్రలైజ్‌డ్ అప్రంటీస్ మేళాకు విశేష స్పందన లభించింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణతో పాటు డీడీ, టీపీవో ఆఫ్ డీటీఈ డాక్టరు ఎంవీ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ఈ మేళాను ప్రారంభించారు. 175 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి 14 ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేపట్టి ఎంపికచేశారు. సాంకేతిక విద్యా కమిషనర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ఈ మేళాను నిర్వహించారు. వికాస్ ఎన్జీవో ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు, ఆశా సొసైటీ ప్రెసిడెంట్ మస్తాన్ వల్లీ, హిందూస్తాన్ షిప్‌యార్డు సీనియర్ మేనేజర్ డాక్టరు సోమసుందంతో పాటు వివిధ సంస్థల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.



మేళాను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధికారులు

ఆయుష్మాన్ భారత్ రీజనల్ వర్క్‌షాప్

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్ర జ్యోతి): ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ రీజనల్ వర్క్‌షాప్‌ను రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో బుధవారం నిర్వహించారు. నేషనల్ హెల్త్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన వర్క్‌షాప్‌లో రాష్ట్రంతోపాటు తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. ఇందు లో భాగంగా ఉత్తమ ప్రాక్టీసులు, కీలక సవా ళ్లపై చర్చలు, ఇతర రాష్ట్రాల అధికారుల నుంచి సలహాలు స్వీకరించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సీఈవో దీప్తి గౌర్‌ముఖర్జీ, అడిషినల్ సీఈవో, ఎండీ బసంత్ గార్గ్, డైరెక్టర్లు కిరణ్ గోపాల్ వాస్క, కెపాసిటీ బిల్డింగ్, స్టేట్ కో-ఆర్డినేషన్ లత గణపతి, నేషనల్ హెల్త్ మిషన్ ఎండీ జె.నివాస్ తదిత రులు మాట్లాడారు. ఈసందర్భంగా అభా ఐడీ జనరేషన్, ఎన్‌సీడీ సీడీ సర్వే, హెచ్ఎంఐఎస్, హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రేషన్స్, ఐఈసీ యాక్టి విటీస్‌పై కీలక సూచనలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు జరిగినవర్క్‌షాప్‌కు 108 మంది అధికా రులు హాజర య్యారు.డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరా వు, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేట ర్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న నివాస్

ధర్మశ్రీ నన్ను కొట్టారు

» విశాఖ డెయిరీలో చర్చల కోసం వెళితే చెయ్యి చేసుకున్నారు

» వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ సన్యాసిరావు ఆవేదన



మాట్లాడుతున్న దొండా సన్యాసిరావు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 28: చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తనను దుర్భాషలాడడమే కాకుండా తనపై చేయిచేసుకున్నారని మండలంలోని వడ్డాది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తీరుకు నిరసనగా తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. బుధవారం వడ్డాదిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వడ్డాది మేజర్ పంచాయతీలో ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌ను పక్కనపెట్టి, పంచాయతీ పాలకవర్గంతో సంబంధంలేని వైసీపీ గ్రామ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తికి అధికారాలను ఎమ్మెల్యే అప్పగించారని విమర్శించారు. అప్పటి నుంచి పంచాయతీ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరు, వంటి వాటిలో అవినీతి జరుగుతున్నదని, దీనివల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తున్నదని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే ధర్మశ్రీ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పారు. దీంతో ఇటీవల మీడియా సమావేశం ఏర్పాటు చేసి, తమ ఆవేదనను వ్యక్తం చేశామని చెప్పారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో విశాఖ రావాలని చైర్మన్ ఆనంద్ తమకు కబురుపెట్టారని తెలిపారు. ఆదివారం విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంలో మంత్రి అమర్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సమక్షంలో ఎమ్మెల్యే ధర్మశ్రీతో రాజీ సమావేశాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ధర్మశ్రీ వ్యవహారశైలిపై పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఇంతలో ధర్మశ్రీ అనుకూల వర్గమైన జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు ఆధ్వర్యంలో పలువురు లోపలికివచ్చి పెదపూడి సర్పంచ్ గోకివాడ వరకృష్ణ, ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావుపై దాడి చేసి కొట్టారన్నారు. దీంతో తీవ్ర అసహనం చెందిన ఆడారి ఆనంద్ కుమార్.. అందరినీ బయటకు వెళ్లిపోవాలని ఆదేశించడంతో వెలుపలికి వచ్చామన్నారు. తరువాత దొండా రాంబాబు, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీలు తనను అసభ్య పదజాలంతో దూషించారని ఆయన చెప్పారు. తాను కూడా దూషించడంతో ఎమ్మెల్యే ధర్మశ్రీ తనపై చెయ్యి చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో ఇంతవరకు ఎవరితోనూ ఒక్క మాట పడలేదని, అలాంటిది ఎమ్మెల్యే ధర్మశ్రీ తనపై చెయ్యి చేసుకోవడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందని సన్యాసిరావు అన్నారు. ఇందుకు నిరసనగా వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధిష్ఠానం చోడవరం టికెట్‌ను ధర్మశ్రీకి కేటాయిస్తే ఆయనకు మద్దతు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. మండలంలో ధర్మశ్రీ తీరును వ్యతిరేకించే వారితో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, రాజకీయంగా తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. కాగా పీఏసీఎస్ చైర్‌పర్సన్ సన్యాసిరావుపై ఎమ్మెల్యే ధర్మశ్రీ చెయ్యి చేసుకోవడానికి గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ దొండా కన్నబాబు, వడ్డాది ఉపసర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి భర్త సూరిఅప్పారావు, పంచాయతీ వార్డు మెంబర్ దొండా నరేశ్, నాయకులు సయ్యపురెడ్డి నవీన్, అడపా నరసింహమూర్తి తదితరులు ఖండించారు. ఈ సమావేశంలో దొండా అచ్చియ్యదొర, దొండా శ్రీను, శిరిగిరిశెట్టి చిన వెంకయ్యదొర, దొండా కుమార్, అద్దంకావు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ అధికారిపై యూటీఎఫ్ ఫిర్యాదు



ఎంఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకుల ఆందోళన

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆనందపురంలో పాఠశాలల హెచ్ఎంలను బెదిరించిన నకిలీ అధికారి చరణ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు యూటీఎఫ్ నేతలు ఫిర్యాదుచేశారు. మండల విద్యాశాఖాధికారి పద్మావతి ఆధ్వర్యంలోనే జిల్లా విద్యా వలంటీర్ పేరుతో నకిలీ వ్యక్తి పాఠశాలల పర్యవేక్షణ ,హెచ్ఎంలతో గూగుల్‌మీట్ నిర్వహించి భయాందోళనలకు గురిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్. అంబేద్కర్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు.

విమ్స్‌లో కత్తితో యువకుడి హల్‌చల్

ఎంవీపీ కాలనీ , ఫిబ్రవరి 28 : విమ్స్‌లో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ యువకుడు కత్తితో హల్‌చల్ చేశాడు. కూరగాయలు కోసే కత్తి పట్టుకుని డబ్బు లు, నగలు ఇవ్వమని ఉద్యోగులను, సిబ్బందిని బెదిరించాడు. ఇంతలో కొందరు ఆరిలోవ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకునే సమయానికి బైక్‌పై పరారయ్యాడు. ఈ సంఘ టనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. యువకుడు పాత నేరస్థుడిగా పోలీసులు భావిస్తున్నారు.

డ్రైనేజీల నిర్మాణం ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 28 : గ్రేటర్ 44వ వార్డు అబిద్‌నగర్‌లో డ్రైనేజీల నిర్మాణ పనులను పునః ప్రారంభించారు. కొద్దిరోజులుగా డ్రైనేజీల నిర్మాణ పనులు నిలిచిపోవడంతో 'నత్తనడకన డ్రైనేజీల నిర్మాణ పనులు' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి బుధవారం నుంచి నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.



నిర్మాణం చేసిన డ్రైనేజీ

పేదలకు చీరలు పంపిణీ

కంచరపాలెం, ఫిబ్రవరి 28 : టీడీపీ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి జోగా మహేశ్ తన జన్మదినం సందర్భంగా జీవీఎంసీ 55వ వార్డు రెడ్డికంచరపాలెంలో బుధవారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకులు బి.రాజు రెడ్డి, సింగం పల్లిఅమ్మోరు మాట్లాడుతు.. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనలు బలపరిచిన అభ్యర్థి గెలుపునకు కృషిచేస్తామన్నారు. జోగా వెంకటరాజు, దయాళ ఈశ్వరరావు, బండారు అప్పలరాజు, పల్లా ధర్మారావు, యలమంచలి కనకేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యంతో పారిశ్రామిక ప్రాంతం ఉక్కిరిబిక్కిరి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 28: జీవీఎంసీ 64, 65 వార్డుల్లోని ప్రజలు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వివిధ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం నేరుగా కాలనీలపై ప్రభావం చూపడం వల్ల ఈ దుస్థితి నెలకొంది. ఆయా వార్డులకు చేరువలో పెదగంట్యాడ పారిశ్రామికవాడ, గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్ ఉండడం, ఆయా పరిశ్రమలు కాలుష్య నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోకపోవడంతో ఘాటైన వాసన, దుమ్ము, బొగ్గు, ధూళి కణాలు ఎగిరివచ్చి కాలనీలను తాకుతుండడంతోస్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కాలుష్యం మూలంగా అనారోగ్యం పాలవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగవరం, వెంకన్నపాలెం, యాతపాలెం, కొత్తదిబ్బపాలెం, సత్యనారాయణ పురం, అశోక్‌నగర్, ప్రియదర్శనీకాలనీ, పెదగంట్యాడ కాలనీల్లో ఈ పరిస్థితి మరీ అధికంగా ఉందని వాపోతున్నారు. కాలుష్య నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలుమార్లు కాలుష్య నియంత్రణ మండలికి విజ్ఞప్తి చేశామని, వారు తాత్కాలిక చర్యలు తీసుకోవడమే తప్ప శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడం లేదని జిల్లా గీత కార్మిక సంఘం నాయకుడు సంపంగి సూరిబాబు తెలిపారు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు.

నకిలీ విద్యాశాఖాధికారి

... 5వ పేజీ తరువాయి

మండల వాట్సాప్ గ్రూపు నుంచి చరణ్ నంబర్‌ను తొలగించారు. నకిలీ అధికారిగా చలామణీ అయిన చరణ్ ఫోన్ నంబర్ ట్రూ కాలర్‌లో 'డీవీవో డీఈవో వీఎస్‌పీ' అని వస్తుంది. అతడి వయస్సు 18 సంవత్సరాలు ఉంటుందని, అంత చిన్న వయస్సులో ఒక యువకుడు తనకు తాను జిల్లా విద్యావలంటీర్‌నని చెప్పుకున్నప్పుడు ఎంఈవో, సదరు కార్యాలయం సిబ్బందికి అనుమానం రాకపోవడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అతడి వ్యవహారంపై జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ వద్ద ప్రస్తావించగా ఆ విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ జరపాలని ఆనందపురం ఎంఈవోను ఆదేశించామన్నారు.

గిరిజనుల అభివృద్ధికి చంద్రబాబు కృషి

... 5వ పేజీ తరువాయి

ప్రాంతాల్లో రోగుల కోసం ఫీడర్ అంబులెన్సులను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజన బిడ్డల కోసం బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం అమలు చేశారన్నారు. జగన్ సీఎం అయ్యాక గిరిజనుల కోసం ఉన్న ఈ పథకాలన్నీ రద్దు చేశారన్నారు. అరకు ప్రాంత ప్రాధాన్యతను, అరకు కాఫీని చంద్రబాబు దేశ, విదేశాల్లో బాగా ప్రమోట్ చేశారని భువనేశ్వరి చెప్పారు. బుధవారం ఉదయం ఆయన (చంద్రబాబు) తనకు ఫోన్ చేసి దాదాపు పావు గంట సేపు అరకులోయ ప్రాంతంలో చేసిన అభివృద్ధి, అరకు కాఫీ గురించి వివరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి సియ్యారి దొన్నుదొర, టీడీపీ శ్రేణులు, అధిక సంఖ్యలో గిరిజన మహిళలు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో కలకలం

... 5వ పేజీ తరువాయి

శాశ్వతంగా తొలగించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. దీనిపై కమిషనర్‌ను కలిసేందుకు పలుమార్లు యత్నించినా సాధ్యంకాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కమిషనర్‌ను కలిసి తనకు న్యాయం చేయాలని కోరాలని, లేనిపక్షంలో అక్కడే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. రాత్రి ఏడున్నర గంటల సమయంలో రెండు బ్లేడ్‌లు జేబులో పెట్టుకుని జీవీఎంసీ కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లారు. అప్పటికే కమిషనర్‌తోపాటు ఇతర అధికారులు కూడా వెళ్లిపోవడంతో పోర్టికో వద్దకు వెళ్లి నేలపై పడుకుని తాను వెంట తీసుకువెళ్లిన బ్లేడ్‌తో ఎడమచేతి మణికట్టు కోసుకున్నారు. విషయం దూరం నుంచి గమనించిన సెక్యూరిటీ సిబ్బంది పరుగున వచ్చి 'ఏం చేస్తున్నావంటూ' శివ ఆదిమూర్తిని ప్రశ్నించగా తన ఆవేదన వెళ్లగక్కుతూ దళితుడినైన తన పట్ల కమిషనర్ సాయికాంత్‌వర్మ నిరంకుశంగా వ్యవహరిస్తుండడం వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని గట్టిగా అరవడం ప్రారంభించారు. ఆయన్ను సెక్యూరిటీ సిబ్బంది అవుట్‌గేట్ వద్దకు తీసుకువెళ్లగా అక్కడ రోడ్డుపై పడుకుండిపోయారు. దీంతో కొంతమంది వచ్చి శివ ఆదిమూర్తికి వీడియో తీస్తూ ఆత్మహత్యకు కారణాలు ఏమిటని అడగడం ప్రారంభించారు. కొందరు 108కి ఫోన్ చేయడంతో అంబులెన్స్ వచ్చి కేజీహెచ్‌కు తీసుకువెళ్లింది. అక్కడ వైద్యులు చికిత్స చేసి డిశ్చార్జి చేశారు.

భీమిలి బీచ్‌లో పనులు ఆపాలని హైకోర్టు ఆదేశం

... 5వ పేజీ తరువాయి

ప్రశ్నిస్తే...అది జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు చూసుకోవలసి ఉంటుందన్నారు. పనులు మాత్రం ఆపలేదు. దీనిపై జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. టౌన్ సర్వే నంబరు 1516, 1517, 1519, 1523 నంబర్లలో ఆ భూమి ఉన్నదని, అయితే తీరానికి కేవలం 50 అడుగుల దూరంలో కాంక్రీట్ నిర్మాణాలు చేస్తున్నారని ఫొటోలతో కేసు వేశారు. ఆ ప్రాంతం సీఆర్‌జెడ్-1లోకి వస్తుందని, హైటైడ్ జోన్‌గా పరిగణించాలని 500 అడుగుల వరకు నిర్మాణాలు చేపట్టకూడదని కోర్టుకు విన్నవించారు. అన్నీ పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి తక్షణమే పనులు ఆపించి, ఆ నివేదిక ఇవ్వాలని జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులను ఆదేశించింది.



ఎలియాస్ హోవే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టైలర్లు

ఘనంగా టైలర్ల దినోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 28: న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ స్థానిక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అతికినిశెట్టి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై కుట్టు మిషన్ సృష్టికర్త ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెడీమేడ్ వస్త్రాలు అందుబాటులోకి వచ్చాక టైలర్ల వృత్తికి ఆదరణ తగ్గిందన్నారు. టైలర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం పలువురు టైలర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తలారి శ్రీనివాస్, డి.చెల్లారావు, పుల్లయ్యనాయుడు, భాస్కరరావు, పోలేశ్వరరావు, వరలక్ష్మి, దేవి, నీలిమ, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలని న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.సత్యన్నారాయణ కోరారు. అక్కిరెడ్డిపాలెంలో నిర్వహించిన టైలర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెడీమేడ్ వస్త్రాల రాకతో టైలర్లకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కెశంకరరావు, శ్రీను, షేక్ సైదాబి, కెసుజాత, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా యూజీడీ గొయ్యి



కాకతీయ జంక్షన్‌లోని గొయ్యి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 28: బాలచెరువు రోడ్డులోని కాకతీయ జంక్షన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి పడిన రంధ్రం గొయ్యిగా మారి ప్రమాదకరంగా నిలిచింది. ఈ జంక్షన్ నుంచి కాకతీయ ఆర్చి వైపు వెళ్లే రోడ్డు ప్రారంభంలోనే పెద్ద గొయ్యి ఏర్పడడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పెట్రోల్ బంక్ పక్కనే.. రోడ్డు మధ్యలో ఏర్పడిన ఈ గొయ్యి ప్రమాదకరంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోలు బంక్‌కు రాకపోకలు సాగించే వాహనదారులతో పాటు నిత్యం ఈ మార్గంలో అనేకమంది రాకపోకలు సాగిస్తుంటారు. అందువల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వేగంగా వచ్చే వాహనదారులు ఈ గోతిని గుర్తించడం కష్టం. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన గొయ్యి మూసివేతకు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అప్పటివరకు ఇక్కడ ప్రమాద సూచికనైనా ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు.

'విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకపోతే చర్యలు'

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 28: ఫీజు బకాయిలు, హాజరు సరిపడ లేదన్న కారణాలతో ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్ ఇవ్వడానికి నిరాకరించే యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరి రక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం హెచ్చరించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈమేరకు అన్ని జిల్లాల ఇంటర్ అధికారులకు సిఫారసు చేసేందుకు కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో సభ్యులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కళాశాలల యాజమాన్యాల వేధింపులు ఉంటే తమను సంప్రదించాలని ఆయన సూచించారు.

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్యా-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 17, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 28, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 38, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 28, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది) 110, బరబాటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 42, దోసకాయలు 34, వుల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 26, కంద 64, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో చంద్రకళ



అక్కిరెడ్డిపాలెంలో నమూనా ప్రాజెక్టులను తిలకిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

విద్యార్థులలోని మేధస్సును వెలికితీయాలి

జాతీయ సైన్స్ దినోత్సవంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ

పెదగంట్యాడ, ఫిబ్రవరి 28: విద్యార్థులలో దాగివున్న సాంకేతిక విజ్ఞానాన్ని, మేధస్సును వెలికి తీసి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్ది దేశ ప్రగతికి వినియోగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నడుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. చిన్న చిన్న ఆవిష్కరణలే అద్భుతమైనవిగా రూపొందుతాయన్నారు. అందువల్ల విద్యార్థుల మెదడుకు ఉపాధ్యాయులు పదును పెట్టాలని సూచించారు. సమగ్రశిక్ష ఏపీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్లోబల్ ఇనిషియేటివ్ ఇండెక్స్‌లో స్విడ్జర్లాండ్ ప్రథమ స్థానంలో ఉండగా, మన దేశం 40వ స్థానంలో ఉందని.. అందువల్ల భారత్‌ను మొదటి స్థానంలో నిలిపేందుకు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. సుమారు 70 మంది విద్యార్థులు ప్రదర్శించిన నమూనా ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. వీటిలో ఉత్తమ నమూనాలు గుర్తించి, వాటిని తీర్చిదిద్దిన విద్యార్థులకు డీఈవో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అప్‌కాస్ట్ కన్వీనర్ పి.రాజారావు, ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికంగా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

అగనంపూడి: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యతు ఉంటుందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదన రావు అన్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో ఇష్టంగా చదువు సాగించాలన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనా ప్రాజెక్టులను తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపక సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనా ప్రాజెక్టులు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మి ఆయా ప్రాజెక్టులను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల్లో ప్రతిభను పెంచే సైన్స్ ఎగ్జిబిషన్లు

అక్కిరెడ్డిపాలెం: సైన్స్ ఎగ్జిబిషన్లు వంటివి విద్యార్థులలోని ప్రతిభను మరింత పెంచేందుకు దోహదపడతాయని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు రూపొందించిన నమూనా ప్రాజెక్టులు చూపరులను ఆకట్టుకున్నాయి. అలాగే మింది హైస్కూల్‌లో సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం

3న చేపట్టే పాదయాత్రను సక్సెస్ చేయాలి

ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు



పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 28: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. మార్చి మూడో తేదీన స్టీల్‌ప్లాంట్ ఆర్చి నుంచి జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వరకు చేపట్టనున్న పాదయాత్రకు సంబంధించిన పోస్టరును బుధవారం ప్లాంట్ పరిపాలన భవనం ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా దుర్మార్గపు ఆలోచనలను విడనాడి ఉక్కు కర్మాగారం పరిరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో ఉక్కు కార్మికులు, నిర్వాసితులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీవీ రమణారెడ్డి, పులి వెంకట రమణారెడ్డి, బీఎంకే నాయక్, రమణ, జి.ప్రభాకరరెడ్డి, పైడిరాజు, సింహాద్రి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోపై ప్రచారం చేయాలి

టీడీపీ గాజువాక ఇన్‌చార్జి పి.శ్రీనివాస్

గాజువాక, ఫిబ్రవరి 28: తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆమోదయోగ్యమైన మేనిఫెస్టోను చంద్రబాబు రూపొందించారన్నారు. ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. సమావేశంలో నాయకులు పులి వెంకటరమణారెడ్డి, శివప్రసాద్, వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సముద్ర భద్రతకు సాంకేతిక ఆవిష్కరణలు దోహదం

- ఈస్ట్రన్ నేవల్ కమాండ్ రియర్ అడ్మిరల్ నెల్సన్ డిసౌజా
- ఘనంగా జాతీయ సైన్స్‌డే వేడుకలు



ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తకు మెడల్ బహూకరిస్తున్న అధికారులు



ఎన్ఏడీ వద్ద చైతన్య స్కూల్‌లో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో దివాకర్

గోపాలపట్నం, ఫిబ్రవరి 28: సముద్ర భద్రత విషయంలో ప్రస్తుత అత్యాధునిక, సాంకేతిక ఆవిష్కరణలు ఎంతో దోహదపడుతున్నట్టు ఈస్ట్రన్ నేవల్ కమాండ్ రియర్ అడ్మిరల్ నెల్సన్ డిసౌజా అన్నారు. జాతీయ సైన్స్‌డే వేడుకలు ఎన్ఎస్‌టీఎల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నెల్సన్ డిసౌజా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టార్పిడోల అభివృద్ధిలో స్వదేశీ సాంకేతికతల పరివర్తన ప్రభావాన్ని అందించిన డీఆర్‌డీవో, ఎన్ఎస్‌టీఎల్‌కు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత సురక్షితమైన నౌకలు, జలాంతర్గాముల అభివృద్ధికి స్టెల్త్ టెక్నాలజీలతో ఎన్ఎస్‌టీఎల్ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం భారతీయుల్లో విడదీయరాని భాగమన్నారు. గణితశాస్త్ర పితామహుడు ఆర్యభట్ట నుంచి నేటి తరం శాస్త్రవేత్తల వరకు చేసిన పరిశోధనలను వివరించారు. ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త ఈ నబ్యోతిశర్మ చేసిన పరిశోధనకు గాను సిలికాన్ మెడల్, ప్రశంసా పత్రాన్నిఆయనకు అందజేశారు. ఎన్ఎస్‌టీఎల్‌లో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. సీవీ రామన్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్.ఎ.డీ జంక్షన్: గ్రేటర్ 52వ వార్డు ఎన్ఏడీ చైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సైన్స్ నమూనాలు ఆలోచింప జేసేలా ఉన్నాయి. ముఖ్యఅతిథిగా ఎంఈవో డి.దివాకర్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సి.వి.రామన్ జీవిత విశేషాలను విద్యా ర్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.మహేష్, టి.సురేశ్, బి.సోనియ, శ్రీవాణి, సాంబయ్య లక్ష్మీమాధవి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే పీఎం మోదీ లక్ష్యం

- బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి



ఆరోగ్య కార్డులను పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, ఫిబ్రవరి 28: దేశంలోని పేదలందరికీ మెరుగైన వైద్యం అందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు లక్షల విలువైన ఆరోగ్య కార్డులతో పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీను, గూటూరు శంకరరావు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికుల పాట్లు



డాక్‌యార్డు సమీపంలో ఆగిపోయిన బస్సు

సింధియా, ఫిబ్రవరి 28: గాజువాక డిపోకు చెందిన పాతగాజువాక నుంచి విజయనగరం వెళ్లే ఆర్టీసీ బస్సు తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో మొరాయించింది. ఏపీ 31 జెడ్ 0490 నంబరు గల ఈ బస్సు బుధవారం నెవల్ డాక్‌యార్డు సమీపంలో ఉన్నట్టుండి ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంట పాటు నిరీక్షించారు. అనంతరం వచ్చి మరో బస్సులో కండక్టర్ ప్రయాణికులను ఎక్కించి గమ్య స్థానాలకు పంపించారు. మరికొందరు ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించారు.

ట్రేడ్ లైసెన్స్ గడువు నేటితో పూర్తి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 28 : జీవీఎంసీ పరిధిలో వ్యాపారాలు చేస్తున్న వారికి డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్సు గడువు గురువారంతో ముగియనున్నట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు వెంటనే ట్రేడ్ లైసె న్స్‌లను రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. నిర్ణీత కాల పరిమితి దాటితే 25 శాతం అదనపు చార్జీ చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. ట్రేడ్ లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేయడం చట్టరీత్యా నేరమని ఈ సందర్భంగా తెలిపారు.

ఘనంగా భద్రతా దినోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 28: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 53వ జాతీయ భద్రతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం జీఎం దువ్వాడ రాంప్రసాద్ మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను వివరించారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, స్థానిక నాయకులు ఇల్లపు ప్రసాద్, వై.సాంబశివరావు, బి.సత్యనారాయణ, బి.శ్రీను, ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో భద్రతా విభాగం జీఎం రాంప్రసాద్, తదితరులు



ఈయూ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సూపర్‌వైజర్ల పద్ధతి మార్చుకోకుంటే ఉద్యమిస్తాం

ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 28: ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోలోని కొంతమంది సూపర్‌వైజర్లు ఓ అసోసియేషన్‌కు అనుకూలంగా పని చేస్తుండడం సిగ్గుచేటు అని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారంలో ఇక్కడి డిపోలో జరిగిన ఎంప్లాయీస్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా సూపర్‌వైజర్లు పద్ధతి మార్చుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల బకాయిల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సకాలంలో ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాలను చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులకు గురవతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల పదవీ విరమణ చేసిన వెంటనే ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఓ సంస్థలో సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన ఉద్యోగులను సత్కరిస్తే అవి వారికి తీపి జ్ఞాపకాలుగా ఉంటాయన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన పి.నారాయణమ్మ, ఎన్‌పీ రాజులను సత్కరించారు. ఈ సమావేశంలో డిపో అధ్యక్షుడు ఎం.గోపాలుడు, కార్యదర్శి రాము, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీహెచ్‌ఎన్ రావు, కోశాధికారి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డులో వ్యర్థాలు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వ్యర్థాలను తొలగించిన తర్వాత ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 28: పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ జంక్షన్ నుంచి కొత్త దిబ్బపాలెం కూడలి వరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డుకు ఇరుపక్కలా పేరుకుపోయిన వ్యర్థాలు, డెబ్రిస్‌ను జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ సిబ్బంది బుధవారం ఉదయం తొలగించారు. 'రోడ్డుకు ఇరుపక్కలా వ్యర్థాలే..' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ఈ రహదారిని శుభ్రపరిచారు. నూతనంగా ఇళ్లు, అపార్టుమెంట్లు నిర్మించేవారు రాత్రిపూట డెబ్రిస్‌ను ఈ మార్గంలో పడేస్తుండడం వల్లే సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

'అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలి'

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 28: వైసీపీ నాయకుల అండతో 68వ వార్డులో నిబంధనలను అతిక్రమిస్తూ చేపట్టిన అక్రమ నిర్మాణాలకు జీవీఎంసీ అధికారులు అడ్డుకట్ట వేయాలని టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి డొప్ప అప్పలరాజు కోరారు. అక్కిరెడ్డిపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు కాలనీలో పది అడుగులు మించి రహదారులు లేకపోయినప్పటికీ పలుచోట్ల అపార్టుమెంట్లు, భారీ భవంతుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణదారులకు పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది అండగా నిలుస్తున్నారని ఆయన ఆరోపించారు. అక్రమ కట్టడాలతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అక్రమ కట్టడాలపై అధికారులు చర్యలు చేపట్టకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు లంకా మురళి, టి.గోవింద్ పాల్గొన్నారు.

ఓటర్ల వివరాలపై తహసీల్దార్ ఆరా



పెందుర్తిలో పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బంగార్రాజు

పెందుర్తి, ఫిబ్రవరి 28: పెందుర్తి తహసీల్దార్‌గా బంగార్రాజు నియమితులయ్యారు. బుధవారం కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. పద్మనాభం తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన వెంకటరావు పద్మనాభం బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం బంగార్రాజు పెందుర్తిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. బీఎల్వోలతో మాట్లాడి ఓటర్ల వివరాలు, కేం ద్రాల్లో సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు,సిబ్బందితో సమావేశమయ్యారు. ఇక, సార్వత్రిక ఎన్నికల బదిలీలో భాగంగా శ్రీకాకుళం జిల్లా నుంచి పెందుర్తికి బదిలీపై ఈనెల 2వతేదీన బాధ్యతలు చేపట్టి ఇంతవరకు ఇక్కడ పనిచేసిన వెంకటరావు నెలరోజుల్లోపే ఆకస్మికంగా బదిలీ కావడం చర్చాంశనీయమైంది. ఇంతవరకు పద్మనాభం తహసీల్దార్‌గా ఉన్న బంగ్రరాజు విశాఖ పార్లమెంట్ పరిధి ఎస్. కోటకు చెందిన వారు కావడంతో ఎన్నికల నిబంధలు మేరకు అనకాపల్లి పార్లమెంట్ పరిధి పెందుర్తి బదిలీ అయ్యారు.

ఒడిశాలో రాజశ్యామల ఆలయం



అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

పెందుర్తి, ఫిబ్రవరి 28: ఒడిశాలోని జర్సుగూడలో స్థానిక ఎమ్మెల్యే దీపాలి ఆధ్వర్యంలో దివంగత సభా కిశోర్‌దాస్ కుటుంబ సభ్యుల ఆధ్వ ర్యంలో రాజశ్యామల ఆలయ నిర్మాణం చేపట్టారు. బుధవారం జరిగిన ఈ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలకు చినముషిడివాడ శారదాపీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి విశిష్ఠ అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా రాజశ్యామల అమ్మవారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా హోమాలకు పీఠాధిపతి పూర్ణాహుతి చేశారు. తమిళనాడుకు చెందిన శిల్పులు రాజశ్యామల అమ్మవారి విగ్రహాన్ని రూపొందించారు.

ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజారు ప్రారంభం

ఎన్.ఎ.డి. జంక్షన్ ఫిబ్రవరి 28:ఎన్ఏడీలోని సుబ్రహ్మణ్యం గుడి పక్కన ఆల్ ఇండియా క్రాఫ్ట్ అసో సియేషన్ ఆధ్వర్యంలో 22 రాష్ట్రాల వస్తువులతో హస్త కళల ప్రదర్శన ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొన్నారు. నెలరోజులపాటు రోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 వరకు ఈ ప్రదర్శన ఉంటుందని విశాఖ ఆర్టీషియన్స్ డెవలప్‌మెంట్ సోసైటీ అధ్యక్షుడు మహ్మద్ నసీమ్ పేర్కొన్నారు సింహాచలం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

బస్టాప్‌కు మరమ్మతులు



బస్టాప్ వెనుక కొత్తగా అమర్చిన జీఐ షీట్లు

ఎన్.ఎ.డి.జంక్షన్ ఫిబ్రవరి 28: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెం వద్ద ఎన్.ఎ.డికి వెళ్లేదారిలో ఏర్పాటు చేసిన బస్టాప్ ఏడాదిన్నర గడవక ముందే శిథిలావస్థకు చేరుకుంది. దీని జీఐ షీట్స్ ఊడిపోయాయి. సరైన నిర్వహణలేక ఈవిధంగా తయారైంది, ఈస్థితిలో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించటంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఇక్కడి బస్టాప్ వెనుక భాగంలో పాడైపోయిన జీఐ షీట్స్‌ను జీవీఎంసీ ఇంజనీరింగ్‌అధికారులు మరమ్మతు చేపట్టారు. స్థానిక నివాసితులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

» టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండిబాబ్జీ



సూపర్ సిక్స్ కరపత్రాలందిస్తున్న గండి బాబ్జీ

అల్లిపురం, ఫిబ్రవరి 28: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి లేకున్నా, ప్రజలపై భారం వేస్తూ అప్పుల్లో ముంచారని టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ విమర్శించారు. బుధవారం జీవీఎంసీ 33వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి పార్టీ త్వరలో అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీని గద్దె దించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బంది ఎదుర్కొంటున్నాయన్నారు. అవినీతి, అరాచకాలతో పాలన సాగుతున్నారు. ఈ స్థితిలో రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేనలు గెలుపొంది ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు తథ్యమన్నారు. ఈ మేరకు ప్రజలు గుణపాఠం చెప్పనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జీఓ 16 అమలు చేయాలి'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 28: ప్రైవేట్ ఎయిడెడ్ సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మేలు చేకూర్చేలా జీవో 16 ప్రభుత్వం విడుదల చేయడం ఆనందకరమని ఎయిడెడ్ స్కూల్స్ కరస్పాండెంట్స్, ఉపాధ్యాయులు అన్నారు. అయితే, ఈ జీవోను వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ప్రైవేట్ ఎయిడెడ్ సంస్థల్లో పనిచేస్తూ ప్రభుత్వ గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు ఈ జీవో గొప్ప అవకాశం కల్పించినట్లయిందన్నారు. మంగళవారం జీవో విడుదల చేసినట్లు చెప్పారు. అన్ని రకాలసదుపాయాలు, ద్విభాషా పాఠ్య పుస్తకాల బోధనతో ప్రభుత్వ పాఠశాలలకు దీటుగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలలను ఇంత వరకు ఎవరూ పట్టించుకోలేదన్నారు. 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు ఈ జీవో వరంలాంటిదన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్‌కు ఈసందర్భంగా వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గీతం విద్యార్థినికి రెండు టైటిల్స్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 28: యూనివర్సిటీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో గీతం వర్సిటీ షట్లర్ త్రిషాలి రెండు విన్నర్ టైటిల్స్‌ను సాధించింది. సింగిల్స్‌లో చాంపియన్ ట్రోఫీతోపాటు నగదు బహుమతిని కైవసం చేసుకున్న త్రిషాలి...డబుల్స్‌లో ప్రవల్లికతో కలిసి టైటిల్ విజేతగా నిలిచింది. మంగుళూరులోని విట్ వర్సిటీలో జరిగిన ఈ టోర్నీ మహిళల డబుల్స్ ఈవెంట్‌లో గీతం యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహించిన త్రిషాలి, ప్రవల్లిక అద్భుతంగా రాణించి ఫైనల్స్‌లో ఆతిథ్య విట్ వర్సిటీ షట్లర్లు కావ్య-మాధురి జంటపై 21-9, 9-21, 21-15 స్కోరుతో విజయం సాధించి విన్నర్ టైటిల్ ట్రోఫీతోపాటు నగదు బహుమతిని సొంతం చేసుకున్నారు. మహిళల సింగిల్స్‌లో త్రిషాలి, పురుషుల సింగిల్స్‌లో గీతం వర్సిటీ షట్లర్ ఆతిథ్య రన్నరప్‌గా నిలిచాడు.



బ్యాడ్మింటన్‌లో టైటిల్స్ సాధించిన త్రిషాలి

పార్వతీశ్వరాలయంలో కళ్యాణ మహోత్సవాలు

సీతంపేట, ఫిబ్రవరి 28: సీతంపేట గణేశ్‌నగర్‌లోని పార్వతీశ్వరాల యం 34వ వార్షిక కల్యాణమహోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భాస్కర శర్మ, శివాజీ శర్మ వేద మంత్రాలతో కల్యాణోత్సవ ఘట్టాన్ని ప్రారంభించారు. శివ పార్వతుల ఉత్సవ మూర్తులకు మంగళస్నానం, పూజ లు చేశారు. గురువారం ఉదయం 9.30 గం టలు గణపతి పూజతో ప్రారంభించి స్వామి వారి కళ్యాణం, సాయంత్రం హోమలు నిర్వహించనున్నారు. భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానం

జడ్పీలో నూతన కంప్యూటర్లు అందజేత

మహారాణిపేట, ఫిబ్రవరి 28: జిల్లా పరిషత్ కార్యాలయంలో పలు విభాగాలకు నూతన కంప్యూటర్లను జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర బుధవారం అందజేశారు. గతంలో మరమ్మతుకు గురైన వాటి స్థానంలో వీటిని ఏర్పాటు చేశారు.



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు



బాలలతో అతిథులు, గ్రంథాలయ సిబ్బంది

దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన సీవీ రామన్

» జాతీయ సైన్స్ దినోత్సవంలో వక్తలు

డాబాగార్డెన్, ఫిబ్రవరి 28: ఎన్నో పరిశోధనలతో సీవీ రామన్ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటారని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి అన్నారు. కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. కళాశాలలో సైన్స్ విభాగాల నుంచి విద్యార్థినులు పలు అంశాలపై ప్రాజెక్టులను తయారు చేశారు. ఆర్ట్స్ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు వీటిని తిలకించారు. ఈసందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, రామన్ పరిశోధనలకు నోబెల్ బహుమతి వచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో కో ఆర్డినేటర్ బి.కల్యాణరాము, సంతోషి అనూష, లావణ్య, శరణ్య, వరలక్ష్మి, హైమావతి,నాగలక్ష్మి, లక్ష్మణ్‌నాయుడు, సత్యనాగవేణి, సునీల్, విద్యార్థినులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

మురళీనగర్; గ్రేటరు 50వ వార్డు మురళీనగర్ ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో బుధవారం శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల బాలల భాగస్వామ్యంతో చేపట్టిన వేడుకల్లో ముందుగా సి.వి.రామన్ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమకారులు దత్తి.అప్పలనాయుడు, స్థానిక సచివాలయ సిబ్బంది, సమీప కాలనీ వాసులు కార్యక్రమంలో హాజరై బాలలకు సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. భారతీయ శాస్త్రవేత్తల్లో ప్రత్యేక స్థానమున్న సివి. రామన్ బాల్యం , చదువు, ప్రతిభను వివరించారు. ఈ సందర్భంగా బాలలకు డ్రాయింగ్ పోటీలు చేపట్టి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. వేడుకల్లో లైబ్రేరియన్ వై.పద్మజ, రిటైర్డు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉన్నత విలువలతో మెలగాలి

అక్కయ్యపాలెం: విద్యతోపాటు ఉన్నత విలువలతో మెలగాలని ఎంఈవోలు బాలామణి, రామారావు అన్నారు. అబిద్‌నగర్‌లోని ఎస్ఆర్ డిజిటల్ స్కూల్‌లో బుధవారం సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ సరికొత్త ఆలోచనలను ప్రతి ఒక్క విద్యార్థి అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మజ, సీఆర్పీ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

57 సైన్స్ నమూనాలతో ఎగ్జిబిషన్

సీతమ్మధార: గ్రేటర్ విశాఖ 23వ వార్డు మద్దిలపాలెం, చైతన్యనగర్‌లోని గాయత్రి విద్యానిలయంలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 57 సైన్స్ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు అయోధ్య రామ మందిరం, వాటర్ ఫౌంటేన్, చంద్రయాన్-3, రైన్ అలారాం తదితర నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ డి.రాజశేఖర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.



నమూనాలతో విద్యార్థులు



ఎస్ఆర్ డిజిటల్ పాఠశాలలో ప్రయోగాలను తిలకిస్తున్న ఎంఈవోలు

గుల్జార్ విశేష సాహిత్య సేవ



గుల్జార్‌కు జ్ఞానపీఠ్ వచ్చిన నేపథ్యంలో కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

సీతంపేట, ఫిబ్రవరి 28: ప్రముఖ ఉర్దూ కవి, సినీగీత రచయిత, హిందీ సినిమా దర్శకుడు గుల్జార్ సాహిత్య రంగంలో విశేష కృషి చేశారని వక్తలు కొనియాడారు. గుల్జార్‌కు కేంద్ర ప్రభుత్వం జ్ఞానపీఠ్ అవార్డు ప్రకటించిన నేపథ్యంలో ఆయన గౌరవార్థం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సభను ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. సొసైటీ కార్యదర్శి నవర ప్రకాశరావు మాట్లాడుతూ ఆయన హిందీ సినిమ పరిశ్రమంలో ప్రముఖ స్థానమని, ఆయన రాసిన పాటలు, మాటలు దర్శకత్వం వహించిన సినిమాలు ఆణిముత్యాలన్నారు. 90 ఏళ్ల వయసులో ఆయనకు కేంద్ర ప్రభుత్వం జ్ఞానపీఠ్ అవార్డు ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు. అనంతరం చిత్ర సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నారావు, హుస్సేన్, చట్లా బాబూరావు రెడ్డి, డాక్టర్ గునేశ్వర బాబ్జీ, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ అగ్రపీఠాధిపతిగా డాక్టర్ జయరావు



మల్లవరపు ప్రకాష్‌నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న జయరావు

మహారాణిపేట, ఫిబ్రవరి 28: రోమన్ క్యాథలిక్ మిషన్ విశాఖ అగ్రపీఠానికి బిషప్‌గా డాక్టర్ పొలిమేర జయరావు నియమితులయ్యారు, బుధవారం మహారాణిపేటలోని బిషప్ కార్యాలయంలో రోమన్ క్యాథలిక్ మిషన్ విశాఖ అగ్ర పీఠాధిపతి మల్లవరపు ప్రకాష్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. సుమారు 12ఏళ్లుగా విశాఖ అగ్రపీఠాధిపతిగా సేవలందించిన ప్రకాష్ పదవీ విరమణ చేయటంతో రోమ్ నగరం పోప్ ప్రావిన్స్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జయరావుకు ఇన్‌చార్జి అగ్రపీఠాధిపతిగా పదవీ బాధ్యతలు అప్పగించారు. అనంతరం. బిషప్ జయరావు మాట్లాడుతూ 1992లో వరంగల్‌లో గురువుగా పదవీ బాధ్యతలు స్వీకరించినట్టు చెప్పారు. అనంతరం 2013లో ఏలూరు బిషప్‌గా బాధ్యతలు స్వీకరించానని, ప్రస్తుతం విశాఖ బిషప్‌గా అదనపు పదవీ బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో పాదర్ జోన్నాడ జాన్ ప్రకాష్, పాదర్ బాలశౌరీ, పాదర్ జయరాజ్, ఎస్. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం,ఫిబ్రవరి 28 : స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, డిప్లొమా చదివిన వారి కోసం నిర్వహించిన సెంట్రలైజ్‌డ్ అప్రెంటీస్ మేళాకు విశేష స్పందన లభించింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణతో పాటు డీడీ, టీపీవో ఆఫ్ డీటీఈ డాక్టరు ఎంఏపీ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ఈ మేళాను ప్రారంభించారు. 175 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి 14 ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేపట్టి ఎంపికచేశారు. సాంకేతిక విద్యా కమిషనర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ఈ మేళాను నిర్వహించారు. వికాస్ ఎన్జీవో ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు, ఆశా సొసైటీ ప్రెసిడెంట్ మస్తాన్ వల్లీ, హిందుస్థాన్ షిప్‌యార్డు సీనియర్ మేనేజర్ డాక్టరు సోమసుందంతో పాటు వివిధ సంస్థల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.



మేళాను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధికారులు

ఆయుష్మాన్ భారత్ రీజనల్ వర్క్‌షాప్

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్ర జ్యోతి): ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ రీజనల్ వర్క్‌షాప్‌ను రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో బుధవారం నిర్వహించారు. నేషనల్ హెల్త్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన వర్క్‌షాప్‌లో రాష్ట్రంతోపాటు తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. ఇందు లో భాగంగా ఉత్తమ ప్రాక్టీసులు, కీలక సవా ళ్లపై చర్చలు, ఇతర రాష్ట్రాల అధికారుల నుంచి సలహాలు స్వీకరించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సీఈవో దీప్తి గౌర్‌ముఖర్జీ, అడిషినల్ సీఈవో, ఎండీ బసంత్ గార్గ్, డైరెక్టర్లు కిరణ్ గోపాల్ వాస్క, కెపాసిటీ బిల్డింగ్, స్టేట్ కో-ఆర్డినేషన్ లత గణపతి, నేషనల్ హెల్త్ మిషన్ ఎండీ జె.నివాస్ తదిత రులు మాట్లాడారు. ఈసందర్భంగా అభా ఐడీ జనరేషన్, ఎన్‌సీడీ సీడీ సర్వే, హెచ్ఎంఐఎస్, హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రేషన్స్, ఐఈసీ యాక్టి విటీస్‌పై కీలక సూచనలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు జరిగినవర్క్‌షాప్‌కు 108 మంది అధికా రులు హాజర య్యారు.డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరా వు, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేట ర్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న నివాస్

ధర్మశ్రీ నన్ను కొట్టారు

» విశాఖ డెయిరీలో చర్చల కోసం వెళితే చెయ్యి చేసుకున్నారు

» వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ సన్యాసిరావు ఆవేదన



మాట్లాడుతున్న దొండా సన్యాసిరావు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 28: చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తనను దుర్భాషలాడడమే కాకుండా తనపై చేయిచేసుకున్నారని మండలంలోని వడ్డాది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తీరుకు నిరసనగా తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. బుధవారం వడ్డాదిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వడ్డాది మేజర్ పంచాయతీలో ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌ను పక్కనపెట్టి, పంచాయతీ పాలకవర్గంతో సంబంధంలేని వైసీపీ గ్రామ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తికి అధికారాలను ఎమ్మెల్యే అప్పగించారని విమర్శించారు. అప్పటి నుంచి పంచాయతీ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరు, వంటి వాటిలో అవినీతి జరుగుతున్నదని, దీనివల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తున్నదని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే ధర్మశ్రీ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పారు. దీంతో ఇటీవల మీడియా సమావేశం ఏర్పాటు చేసి, తమ ఆవేదనను వ్యక్తం చేశామని చెప్పారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో విశాఖ రావాలని చైర్మన్ ఆనంద్ తమకు కబురుపెట్టారని తెలిపారు. ఆదివారం విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంలో మంత్రి అమర్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సమక్షంలో ఎమ్మెల్యే ధర్మశ్రీతో రాజీ సమావేశాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ధర్మశ్రీ వ్యవహారశైలిపై పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఇంతలో ధర్మశ్రీ అనుకూల వర్గమైన జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు ఆధ్వర్యంలో పలువురు లోపలికివచ్చి పెదపూడి సర్పంచ్ గోకివాడ వరకృష్ణ, ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావుపై దాడి చేసి కొట్టారన్నారు. దీంతో తీవ్ర అసహనం చెందిన ఆడారి ఆనంద్ కుమార్... అందరినీ బయటకు వెళ్లిపోవాలని ఆదేశించడంతో వెలుపలికి వచ్చామన్నారు. తరువాత దొండా రాంబాబు, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీలు తనను అసభ్య పదజాలంతో దూషించారని ఆయన చెప్పారు. తాను కూడా దూషించడంతో ఎమ్మెల్యే ధర్మశ్రీ తనపై చెయ్యి చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో ఇంతవరకు ఎవరితోనూ ఒక్క మాట పడలేదని, అలాంటిది ఎమ్మెల్యే ధర్మశ్రీ తనపై చెయ్యి చేసుకోవడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందని సన్యాసిరావు అన్నారు. ఇందుకు నిరసనగా వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధిష్ఠానం చోడవరం టికెట్‌ను ధర్మశ్రీకి కేటాయిస్తే.. ఆయనకు మద్దతు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. మండలంలో ధర్మశ్రీ తీరును వ్యతిరేకించే వారితో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, రాజకీయంగా తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. కాగా పీఏసీఎస్ చైర్‌పర్సన్ సన్యాసిరావుపై ఎమ్మెల్యే ధర్మశ్రీ చెయ్యి చేసుకోవడానికి గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ దొండా కన్నబాబు, వడ్డాది ఉపసర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరావు, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి భర్త సూరిఅప్పారావు, పంచాయతీ వార్డు మెంబర్ దొండా నరేశ్, నాయకులు సయ్యపురెడ్డి నవీన్, అడపా నరసింహమూర్తి తదితరులు ఖండించారు. ఈ సమావేశంలో దొండా అచ్చియ్యదొర, దొండా శ్రీను, శిరిగిరిశెట్టి చిన వెంకయ్యదొర, దొండా కుమార్, అదట్రావు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ అధికారిపై యూటీఎఫ్ ఫిర్యాదు



ఎంఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకుల ఆందోళన

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆనందపురంలో పాఠశాలల హెచ్ఎంలను బెదిరించిన నకిలీ అధికారి చరణ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు యూటీఎఫ్ నేతలు ఫిర్యాదుచేశారు. మండల విద్యాశాఖాధికారి పద్మావతి ఆధ్వర్యంలోనే జిల్లా విద్యా వలంటీర్ పేరుతో నకిలీ వ్యక్తి పాఠశాలల పర్యవేక్షణ ,హెచ్ఎంలతో గూగుల్‌మీట్ నిర్వహించి భయాందోళనలకు గురిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్. అంబేద్కర్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు.

విమ్స్‌లో కత్తితో యువకుడి హల్‌చల్

ఎంవీపీ కాలనీ , ఫిబ్రవరి 28 : విమ్స్‌లో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ యువకుడు కత్తితో హల్‌చల్ చేశాడు. కూరగాయలు కోసే కత్తి పట్టుకుని డబ్బు లు, నగలు ఇవ్వమని ఉద్యోగులను, సిబ్బందిని బెదిరించాడు. ఇంతలో కొందరు ఆరిలోవ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకునే సమయానికి బైక్‌పై పరారయ్యాడు. ఈ సంఘ టనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. యువకుడు పాత నేరస్తుడిగా పోలీసులు భావిస్తున్నారు.

డ్రైనేజీల నిర్మాణం ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 28 : గ్రేటర్ 44వ వార్డు అబిద్‌నగర్‌లో డ్రైనేజీల నిర్మాణ పనులను పునః ప్రారంభించారు. కొద్దిరోజులుగా డ్రైనేజీల నిర్మాణ పనులు నిలిచిపోవడంతో 'నత్తనడకన డ్రైనేజీల నిర్మాణ పనులు' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి బుధవారం నుంచి నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.



నిర్మాణం చేసిన డ్రైనేజీ

పేదలకు చీరలు పంపిణీ

కంచరపాలెం, ఫిబ్రవరి 28 : టీడీపీ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి జోగా మహేశ్ తన జన్మదినం సందర్భంగా జీవీఎంసీ 55వ వార్డు రెడ్డికంచరపాలెంలో బుధవారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకులు బి.రాజు రెడ్డి, సింగం పల్లిఅమ్మోరు మాట్లాడుతు.. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనలు బలపరిచిన అభ్యర్థి గెలుపునకు కృషిచేస్తామన్నారు. జోగా వెంకటరాజు, దయాళ ఈశ్వరరావు, బండారు అప్పలరాజు, పల్లా ధర్మారావు, యలమంచిలి కనకేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యంతో పారిశ్రామిక ప్రాంతం ఉక్కిరిబిక్కిరి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 28: జీవీఎంసీ 64, 65 వార్డుల్లోని ప్రజలు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వివిధ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం నేరుగా కాలనీలపై ప్రభావం చూపడం వల్ల ఈ దుస్థితి నెలకొంది. ఆయా వార్డులకు చేరువలో పెదగంట్యాడ పారిశ్రామికవాడ, గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్ ఉండడం, ఆయా పరిశ్రమలు కాలుష్య నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోకపోవడంతో ఘాటైన వాసన, దుమ్ము, బొగ్గు, ధూళి కణాలు ఎగిరివచ్చి కాలనీలను తాకుతుండడంతోస్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కాలుష్యం మూలంగా అనారోగ్యం పాలవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగవరం, వెంకన్నపాలెం, యాతపాలెం, కొత్తదిబ్బపాలెం, సత్యనారాయణ పురం, అశోక్‌నగర్, ప్రియదర్శనీకాలనీ, పెదగంట్యాడ కాలనీల్లో ఈ పరిస్థితి మరీ అధికంగా ఉందని వాపోతున్నారు. కాలుష్య నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలుమార్లు కాలుష్య నియంత్రణ మండలికి విజ్ఞప్తి చేశామని, వారు తాత్కాలిక చర్యలు తీసుకోవడమే తప్ప శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడం లేదని జిల్లా గీత కార్మిక సంఘం నాయకుడు సంపంగి సూరిబాబు తెలిపారు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

నకిలీ విద్యాశాఖాధికారి

... 5వ పేజీ తరువాయి

మండల వాట్సాప్ గ్రూపు నుంచి చరణ్ నంబర్‌ను తొలగించారు. నకిలీ అధికారిగా చలామణి అయిన చరణ్ ఫోన్ నంబర్ ట్రూ కాలర్‌లో 'డీవీవో డీఈవో వీఎస్‌పీ' అని వస్తుంది. అతడి వయస్సు 18 సంవత్సరాలు ఉంటుందని, అంత చిన్న వయస్సులో ఒక యువకుడు తనకు తాను జిల్లా విద్యావలంటీర్‌నని చెప్పుకున్నప్పుడు ఎంఈవో, సదరు కార్యాలయం సిబ్బందికి అనుమానం రాకపోవడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అతడి వ్యవహారంపై జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ వద్ద ప్రస్తావించగా ఆ విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ జరపాలని ఆనందపురం ఎంఈవోను ఆదేశించామన్నారు.

గిరిజనుల అభివృద్ధికి చంద్రబాబు కృషి

... 5వ పేజీ తరువాయి

ప్రాంతాల్లో రోగుల కోసం ఫీడర్ అంబులెన్సులను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజన బిడ్డల కోసం బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం అమలు చేశారన్నారు. జగన్ సీఎం అయ్యాక గిరిజనుల కోసం ఉన్న ఈ పథకాలన్నీ రద్దు చేశారన్నారు. అరకు ప్రాంత ప్రాధాన్యతను, అరకు కాఫీని చంద్రబాబు దేశ, విదేశాల్లో బాగా ప్రమోట్ చేశారని భువనేశ్వరి చెప్పారు. బుధవారం ఉదయం ఆయన (చంద్రబాబు) తనకు ఫోన్ చేసి దాదాపు పావు గంట సేపు అరకులోయ ప్రాంతంలో చేసిన అభివృద్ధి, అరకు కాఫీ గురించి వివరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి సియ్యారి దొన్నుదొర, టీడీపీ శ్రేణులు, అధిక సంఖ్యలో గిరిజన మహిళలు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో కలకలం

... 5వ పేజీ తరువాయి

శాశ్వతంగా తొలగించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. దీనిపై కమిషనర్‌ను కలిసేందుకు పలుమార్లు యత్నించినా సాధ్యంకాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కమిషనర్‌ను కలిసి తనకు న్యాయం చేయాలని కోరాలని, లేనిపక్షంలో అక్కడే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. రాత్రి ఏడున్నర గంటల సమయంలో రెండు బ్లేడ్‌లు జేబులో పెట్టుకుని జీవీఎంసీ కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లారు. అప్పటికే కమిషనర్‌తోపాటు ఇతర అధికారులు కూడా వెళ్లిపోవడంతో పోర్టికో వద్దకు వెళ్లి నేలపై పడుకుని తాను వెంట తీసుకువెళ్లిన బ్లేడ్‌తో ఎడమచేతి మణికట్టు కోసుకున్నారు. విషయం దూరం నుంచి గమనించిన సెక్యూరిటీ సిబ్బంది పరుగున వచ్చి 'ఏం చేస్తున్నావంటూ' శివ ఆదిమూర్తిని ప్రశ్నించగా తన ఆవేదన వెళ్లగక్కుతూ దళితుడినైన తన పట్ల కమిషనర్ సాయికాంత్‌వర్మ నిరంకుశంగా వ్యవహరిస్తుండడం వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని గట్టిగా అరవడం ప్రారంభించారు. ఆయన్ను సెక్యూరిటీ సిబ్బంది అవుట్‌గేట్ వద్దకు తీసుకువెళ్లగా అక్కడ రోడ్డుపై పడుకుండిపోయారు. దీంతో కొంతమంది వచ్చి శివ ఆదిమూర్తికి వీడియో తీస్తూ ఆత్మహత్యకు కారణాలు ఏమిటని అడగడం ప్రారంభించారు. కొందరు 108కి ఫోన్ చేయడంతో అంబులెన్స్ వచ్చి కేజీహెచ్‌కు తీసుకువెళ్లింది. అక్కడ వైద్యులు చికిత్స చేసి డిశ్చార్జి చేశారు.

భీమిలి బీచ్‌లో పనులు ఆపాలని హైకోర్టు ఆదేశం

... 5వ పేజీ తరువాయి

ప్రశ్నిస్తే...అది జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు చూసుకోవలసి ఉంటుందన్నారు. పనులు మాత్రం ఆపలేదు. దీనిపై జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. టౌన్ సర్వే నంబరు 1516, 1517, 1519, 1523 నంబర్లలో ఆ భూమి ఉన్నదని, అయితే తీరానికి కేవలం 50 అడుగుల దూరంలో కాంక్రీట్ నిర్మాణాలు చేస్తున్నారని ఫొటోలతో కేసు వేశారు. ఆ ప్రాంతం సీఆర్‌జెడ్-1లోకి వస్తుందని, హైటైడ్ జోన్‌గా పరిగణించాలని 500 అడుగుల వరకు నిర్మాణాలు చేపట్టకూడదని కోర్టుకు విన్నవించారు. అన్నీ పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి తక్షణమే పనులు ఆపించి, ఆ నివేదిక ఇవ్వాలని జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులను ఆదేశించింది.



కల్యాణం చేస్తున్న అర్చకుడు

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం,ఫిబ్రవరి 28 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనముల చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమశాస్త్ర విధానంలో కల్యాణక్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా గరుడసేవ

వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా బుధవారం గరుడసేవ వైభవంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో శ్రీకారం చుట్టి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ పూజలు జరిపారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలాపనల నడుమ భక్తులు స్వామి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, ఫిబ్రవరి 28 : అప్పన్న స్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి మధురవాడ ప్రాంతానికి చెందిన ధవళ వెంకట సూర్యనారాయణశర్మ దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను నగదు రూపంలో దేవస్థానం పీఆర్‌ఓ అప్పలనాయుడుకు బుధవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అభ్యర్థి ఎవరైనా విజయమే లక్ష్యం

కొమ్మాది, ఫిబ్రవరి 28 : భీమిలి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా వారి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి,ఆరో వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లుగా కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా కష్టపడి పనిచేసి విజయానికి కృషి చేయాలని కోరారు. వైసీపీ శ్రేణులు టీడీపీ, జనసేన మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గెడ్డలో పూడికతీత

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 28 : గ్రేటర్ పరిధిలోని 16 వార్డు పాత వెంకోజీపాలెంలోని హెచ్‌బీ కాలనీ నుంచి చెన్నకేశవ అపార్టుమెంటు వద్ద, అక్కడి నుంచి భానునగర్, రజక వీధి మీదుగా ప్రధాన గెడ్డను కలిసే గెడ్డలోని పూడికను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు బుధవారం తొలగించారు. ఈ పనులను మేస్త్రిలు చిన్నరాజు, జి. బాబు పర్యవేక్షించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సింహాచలం, ఫిబ్రవరి 28 : సింహాచలం 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాతఅడివివరం, చింతచెట్టు వీధి, ధారపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 28 : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు అన్నారు. బుధవారం వారు 3న స్టీల్‌ప్లాంట్ ఆర్చి నుంచి జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వరకు చేపట్టనున్న పాదయాత్రకు సంబంధించిన పోస్టరును ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ఆవిష్కరించారు.

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్ధ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26,టమాటా 17, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 28, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 38, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 28, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళా దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది) 110, బరబటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 42, దోస కాయలు 34,వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 26 , కంద 64, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీలో..

ఆస్పత్రికి వెళ్లే దారేది?

- సింహాచలం 30 పడకల ఆస్పత్రికి వాహనాలు వెళ్లే దారి లేక అవస్థలు
- ఏళ్ల తరబడి సమస్య

సింహాచలం, ఫిబ్రవరి 28 : సింహాచలంలోని 30 పడకల ఆస్పత్రికి వాహనాలు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రిలో ప్రతిరోజూ 150 వరకు ఔట్ పేషెంట్ విభాగం ద్వారా, ఇన్ పేషెంట్ విభాగం ద్వారా మరి కొంతమంది, కుని ఆపరేషన్లు, అత్యవసర సేవల రూపంలో కొందరికి సేవలు అందుతున్నాయి. అయితే ఆస్పత్రికి వాహనాలపై వచ్చేవారు లోపలికి వెళ్లడానికి సరైన మార్గ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణం కోసం ఏడాది క్రితం ఆసుపత్రి ముందు భాగంలో ఇష్టానుసారం తవ్వి వదిలేశారు. ఆసుపత్రి వైద్యులు ఈ విషయమై జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతోంది. ఆస్పత్రి రోడ్డుకు దిగువగా నిర్మించడంతో ప్రస్తుత బీఆర్‌టీఎస్ రోడ్డు ఆసుపత్రి కంటే నాలుగు అడుగుల ఎత్తున ఉంది. దీంతో తవ్వేసిన రోడ్డు వల్ల అంబులెన్స్‌లు కాని, రోగులు రాకపోకలు సాగించే ఆటోలు కాని ఆసుపత్రి లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో అత్యవసర సమయాల్లో కొందరు రోగులు గోపాలపట్నం లేదా ఆరిలోవలోని ప్రైవేటు ఆసుపత్రుకు వెళ్తున్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తక్షణమే ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టిసారించి సొంతంగా అంబులెన్స్ ఏర్పాటు చేయడంతో పాటు రాకపోకలకు మార్గం ఏర్పాటు చేయించాలని పలువురు కోరుతున్నారు.



నూతనంగా తూర్పున ఏర్పాటు చేస్తున్న మార్గం



ప్రధాన గేటు వద్ద వాహనాలు వెళ్లలేని విధంగా ఉన్న మార్గం

జల జీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికీ తాగునీరు

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 28 : దేశ వ్యాప్తంగా ప్రతి ఇంటికి తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో కేంద్రం జల జీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని బీజేపీ నాయకులు అన్నారు. ప్రజా పోరు యాత్రలో భాగంగా బుధవారం వారు అనంతవరం, పెంట, కొవ్వాడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జల జీవన్ మిషన్ కింద పెంట గ్రామానికి రూ. 6 లక్షలు మంజూరైట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు ప్రసాదరావు. మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పేర్రాజు, సారిక ప్రకాశ్, పాశిల రమణ పాల్గొన్నారు.

వంద మందికి కేన్సర్ వైద్య పరీక్షలు



రోగితో మాట్లాడుతున్న వైద్యులు, పక్కన విమ్స్ డైరెక్టర్ రాంబాబు

ఆరిలోవ, ఫిబ్రవరి 28 : విమ్స్‌లో బుధవారం నిర్వహించిన కేన్సర్ మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమ్స్‌లో నూతనంగా కేన్సర్ విభాగాలను ప్రారంభించామని, వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయడానికి శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం వైద్యులు వంద మందికి నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్, చర్మం, ఎముకలకు సంబంధించిన కేన్సర్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ర్యాలీ



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 28 : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ సంచులకు బదులు గుడ్డ బ్యాగులు వినియోగించాలని అవగాహన కల్పిస్తూ.. ర్యాలీ జరిపారు.ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ అధికారి పి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టడానికి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

పద్మనాభం తహసీల్దారుగా వెంకటరావు



పద్మనాభం, ఫిబ్రవరి 28 : పద్మనాభం తహసీల్దారుగా ఎస్. వెంకటరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పెందుర్తి తహసీల్దారుగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహసీల్దారుగా పని చేసిన సీహెచ్ బంగార్రాజును పెందుర్తికి బదిలీ చేశారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం



పెచ్చులూడిన శ్లాబు

ఆనందపురం, ఫిబ్రవరి 28 : మండలంలోని వెల్లంకి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-2 భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఇక్కడ ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనాన్ని 15 ఏళ్ల క్రితం నిర్మించారు. నాటి నుంచి ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో భవనం పూర్తిగా పాడైంది. శ్లాబ్ పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో పిల్లలకు పక్కనున్న మధ్యాహ్న భోజన పథకం వంట శాలలో పాఠాలు బోధిస్తున్నారు. భవనం దుస్థితిపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికితీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు. భవనం ప్రమాదకరంగా ఉండడం, అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను వేరే పాఠశాలల్లో చేర్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం



బాంధేవుపురంలో టీడీపీ నాయకుల ప్రచారం

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 28 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు, యువతకు ఎంతో మేలు జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు కాళ్ల నగేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి బాంధేవుపురం, విజయరాంపురం ఎస్సీ కాలనీల్లో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు ప్రతి నెల రూ.1500 ఖాతాలో జమ చేస్తామన్నారు. అలాగే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తారన్నారు. అమ్మకు వందనం పథకం ద్వారా ఇంట్లో చదివే పిల్లలందరికీ రూ. 15 వేలు చొప్పున అందిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, శ్రీను, అప్పలనాయుడు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పెదజాలారిపేటలో...

పెదవాల్తేరు : తూర్పు నియోజకవర్గంలోని 19వ వార్డు పెదజాలారిపేటలో కార్పొరేటర్ నొల్లి నూకరత్నం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బుధవారం భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామాలయం వీధి, గాంధీబొమ్మ సెంటర్, చేపల మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తెడ్డు రాజు, చిరంజీవి, లక్ష్మణ్, పోలీస్, పైడిరాజు, రవి, వీర్రాజు, పోలరావు, తేజ, ముక్కాల, తదితరులు పాల్గొన్నారు.



గీతం యూనివర్సిటీలో సివి రామన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆచార్యులు



సైన్స్ డే వేడుకల్లో చిన్నారులతో కలిసి పాల్గొన్న వీసీ ప్రసాదరెడ్డి

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

భీమునిపట్నం, ఫిబ్రవరి 28 : ప్రపంచాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించేది సైన్స్ మాత్రమే అని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అన్నారు. బుధవారం ఆయన డైట్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల ఆసక్తి కలిగివున్నప్పుడే దేశంలో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు ప్రదర్శించిన సైన్స్ ఫెయిర్‌ను తిలకించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సోమయాజులు, మాణిక్యంనాయుడు, గొట్టేటి రవి, మహాలక్ష్మి, త్రినాథరావు పాల్గొన్నారు. భీమిలి ప్రభుత్వ ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాలలోనూ సైన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాఖ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనో గ్రఫీ సీనియరు సైంటిస్ట్ డాక్టర్ కె. మనీషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, ఫిజిక్స్ హెచ్‌వోడి ప్రసాదరావు పాల్గొన్నారు. అలాగే కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో జీసీడీఓ కలీషా బేగం, ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు. బీచ్ రోడ్డులోని జీఎస్ఆర్ భవన్‌లో ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ ఏడో సెక్టరులోని జేకే టాలెంట్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు 40 స్టాళ్లు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ జయకుమార్ వీటిని పర్యవేక్షించారు.

కొమ్మాదిలో...

కొమ్మాది : మధురవాడ బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న చైతన్య ఇంగ్లీష మీడియం పాఠశాలలోనూ జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు పలు నమూనాలను రూపొందించి, ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సందీప్, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరావు, డీన్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గీతంలో...

సాగర్‌నగర్ : విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు దేశ ఆర్థిక ప్రగతికి కీలకమని బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం (బార్క్) విశ్రాంత శాస్త్రవేత్త, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ బీవీఆర్ టాటా అన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నూతన విజ్ఞాన శాస్త్రాలైన బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ వంటివి ప్రోత్సహించడానికి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసిందన్నారు. అంతకు ముందు పలువురు సర్ సివి రామన్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి, నివాళి అర్పించారు. అలాగే ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్ (ఐపీఏ) క్వాంటమ్ ఇన్వర్మేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ అన్న అంశంపై నిపుణులతో ప్రసంగాలను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి, బార్క్ విశ్రాంత శాస్త్రవేత్త ప్రొఫెసర్ రవికుమార్, వివిధ విభాగాధిపతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఏయూ విద్యా విభాగంలో..

వెంకోజీపాలెం : ఏయూ విద్యా విభాగంలోనూ సైన్స్ డే నిర్వహించారు. ముందుగా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు, తదితరులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా షారోన్ రాజు మాట్లాడుతూ రామన్ ఏయూ భౌతికశాస్త్ర విభాగంలో ఎన్నో పరిశోధనలు జరిపారని, ఏయూతో ఆయనకు సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. గణిత శాస్త్ర విభాగంలోనూ వేడుకలు జరిగాయి. అలాగే వృక్షశాస్త్ర విభాగంలో జరిగిన వేడుకల్లో విభాగాధిపతి ఆచార్య పీకే రత్నకుమార్, ఆచార్య బి. సుజాత, ఆచార్య డి. సంధ్యా దీపిక, డాక్టర్ బి. సంధ్యశ్రీ, డాక్టర్ బలరామస్వామి యాదవ్ పాల్గొన్నారు. కాగా జాతీయ సైన్స్ డే పురస్కరించుకుని తన కార్యాలయానికి వచ్చిన కిడ్స్ క్రియేట్ పాఠశాల చిన్నారులతో వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి కాసేపు సరదాగా గడిపారు.

దాకమర్రిలో...

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని దాకమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు 24 అంశాలకు సంబంధించిన నమూనాలను ప్రదర్శనలో ఉంచారు.

పద్మనాభంలో...

పద్మనాభం : పద్మనాభంలోని కేజీబీవీలో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బాలికలు పలు నమూనాలతో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలోనూ వేడుకలు జరిగాయి.

పెదవాల్తేరులో..

పెదవాల్తేరు : ఈస్టు పాయింట్ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను గీతం వర్సిటీ వైద్య విభాగం ఉప ఆచార్యులు డాక్టర్ సోఫియా ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె. మధురవాణి, గాయత్రి విద్యా పరిషత్ సంస్థలు, గీతం విద్యా సంస్థల సమాంతర వైద్య విభాగం పరిశోధకులు పాల్గొన్నారు. అలాగే కేడీపీఎం హైస్కూల్‌లో స్థిత ప్రజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలు జరిపారు.



వాకర్స్ క్లబ్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవలో ఇండోర్ స్టేడియం

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ ఫిబ్రవరి 28 : టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరిలోవ, ముడసర్లోవ పరిసర ప్రాంతాల క్రీడాకారుల కోసం హెల్త్ సిటీ ఆవరణలో 2.84 ఎకరాల్లో ఇండోర్ స్టేడియం నిర్మించనున్నట్టు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హామీ ఇచ్చారు. బుధవారం ఆయన ముడసర్లోవ వద్ద వాకర్స్ క్లబ్ సభ్యులను కలిసి రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయంలో ఇక్కడ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయించామని, మళ్లీ అధికారంలోకి వస్తే ఇండోర్ స్టేడియం నిర్మిస్తామని చెప్పారు. కాగా వాకర్స్‌కు వాలీబాల్ గ్రౌండ్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినందుకు సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌ఛార్జిలు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరి గోవింద్, రాగతి అచ్యుతరావు, నాయకులు ఒమ్మి పోలరావు, గాడి సత్యం, ముగడ రాజారావు, బాలరాజు, పాల్గొన్నారు.

చంద్రంపేట ఉన్నత పాఠశాలలో ఐబీ బృందం



విద్యార్థినితో మాట్లాడుతున్న బృంద సభ్యులు

కొమ్మాది,ఫిబ్రవరి 28 : వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఐబీ (ఇంటర్నేషనల్ బార్కెలేట్ సిలబస్) అందుబాటులోకి తీసుకురానున్నట్టు డీఈఓ చంద్రకళ చెప్పారు. ఈమేరకు విదేశీ బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతుందన్నారు. బుధవారం యూఎస్, యూకే దేశాలకు చెందిన బృంద సభ్యులు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో మౌలిక వసతులు, శాస్త్రీయ బోధన, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం, ఇంగ్లీషు మీడియంలో బోధన, ట్యాబ్‌ల వినియోగం, కంప్యూటర్ శిక్షణ తదితర అంశాలను పరిశీలించారు. అలాగే జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో సైన్స్ మేళాను ప్రారంభించి, విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలికి చెందిన ఆచార్య కేశిరాజు శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకపోతే చర్యలు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 28 : ఫీజు బకాయిలు, హాజరు సరిపడ లేదన్న కారణాలతో ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్ ఇవ్వడానికి నిరాకరించే యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరి రక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం హెచ్చరించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈమేరకు అన్ని జిల్లాల ఇంటర్ అధికారులకు సిఫారసు చేసేందుకు కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో సభ్యులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కళాశాలల యాజమాన్యాల వేధింపులు ఉంటే తమను సంప్ర తించాలని ఆయన సూచించారు.

ట్రేడ్ లైసెన్స్ గడువు నేటితో పూర్తి : కమిషనర్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 28 : జీవీఎంసీ పరిధిలో వ్యాపారాలు చేస్తున్న వారికి డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్సు గడువు గురువారంతో ముగియనున్నట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు వెంటనే ట్రేడ్ లైసె న్స్‌లను రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. నిర్ణీత కాల పరిమితి దాటితే 25 శాతం అదనపు చార్జీ చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. ట్రేడ్ లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం: ఎంపీ ఎంవీవీ



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సత్యనారాయణ

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 28 : వైసీపీ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చి పాలన సాగిస్తుందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన 9వ వార్డు విశాలాక్షినగర్, దయాల్‌నగర్, జోడుగుళ్లపాలెం, కైలాసగిరి రోడ్డు ప్రాంతాల్లో రూ. 2.10 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, కాలువలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ స్వాతిదాస్, జీవీఎంసీ వర్క్స్ ఏఈ శ్రీధర్, వైసీపీ నాయకులు, జోడుగుళ్లపాలెం గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తగరపువలసలో టైలర్ల దినోత్సవం



తగరపువలసలో ర్యాలీ చేస్తున్న టైలర్లు

తగరపువలస, ఫిబ్రవరి 28 : తగరపువలసలో టైలర్ల దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా ఎల్లమాంబ టైలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద సమావేశమయ్యారు. టైలర్ల జీవితాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, దుస్తులకు సంబంధించిన కాంట్రాక్టులను ప్రభుత్వం స్థానికంగా ఉన్న టైలర్లకు అప్పగించాలని కోరారు.

భీమిలిలో...

భీమునిపట్నం : భీమిలిలో నూకాంబికా టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. టైలర్లు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు మొల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి మల్లేటి హరిబాబు, కోశాధికారి ఎస్. వెంకటరావు, ముఖ్య సలహాదారులు ఎస్‌కె మొహిద్దీన్, సీనియరు నాయకుడు గుర్ల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

'నారీ శక్తి వందన్' విజయవంతం చేయండి

పెదవాల్తేరు, ఫిబ్రవరి 28 : నగరంలో వచ్చే నెల 4, 5, 6వ తేదీల్లో జరిగే నారీ శక్తి వందన్ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం బీజేపీ మహిళా మోర్చా పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు వచ్చే నెలలో నారీ శక్తి వందన్ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని జిల్లా, మం డల స్థాయిలో నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఈమేరకు 4న జిల్లాస్థాయిలో 500 మందితో 2కే రన్ ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వత్సవాయి రోహిణి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వాడమొదుల స్పందన, జిల్లా ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, జ్యోతి, అనిత, మంజుల, శాంతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

సింహాచలం, ఫిబ్రవరి 28 : జీవీఎంసీ 98వ వార్డులో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కార్పొరేటర్ పివి నరసింహం అన్నారు. బుధవారం ఆయన ఆకుల వీధిలో జీవీఎంసీ సాధారణ నిధులు రూ.19.5 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, విశాఖ పార్లమెంటరీ కమిటీ కార్యదర్శి లండ శ్రీనివాస్, పాల్గొన్నారు.